టాప్ న్యూస్

## అసెంబ్లీకి జగన్



- సూపర్ 6కి కేటాయించిన నిధుల తీరుపై ప్రశ్నించాలని జగన్ భావిస్తున్నట్లు సమాచారం
- ఏపీ రాజకీయాల్లో చర్చ

02

## విమానంలో విరిగిన సీటు



- ఆ సీట్లోనే కూర్చుని ప్రయాణం చేసిన కేంద్రమంత్రి
- క్షమాపణలు చెప్పిన ఎయిర్ లైన్స్ సంస్థ
- ట్వీట్ ద్వారా వెల్లడించిన శివరాజ్ సింగ్ చౌహాన్

02

## మెట్రో @ 24



- స్టేషన్లు ప్రకటించిన మెట్రోరైల్ యాజమాన్యం
- నాగోల్ టు ఎయిర్ పోర్ట్ .. ఫుల్ కనెక్టివిటీ

04


ANN తెలుగు

Follow: @ANNTELUGU

23-02-2025

# మహా పత్రిక

ఆదివారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 83 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM




కంది రామచంద్రారెడ్డి

వీకెండ్ అనాలసిస్

## వ్యూహమా.. భయమా?

ఎమ్మెల్సీ ఎన్నికలు తెలంగాణ రాష్ట్ర రాజకీయాలపై ప్రభావం చూపనున్నాయి. బిఆర్ఎస్ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఎందుకు దూరంగా ఉంది? గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మాత్రమే అధికారపార్టీ ఎందుకు పోటీచేస్తోంది? ఎమ్మెల్సీ ఎన్నికలలో ప్రభావం చూపుతున్న అంశాలేంటి? రాజకీయవర్గాల్లో ఈ అంశాలపై ఆసక్తికర చర్చలు సాగుతున్నాయి. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తో పాటు వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, కీలక నేత హరీష్ రావు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాలున్న గ్రాడ్యుయేట్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పోటీకి దూరంగా ఉండడం ఆశ్చర్యకరమే. ఇప్పటికీ ఉత్తర తెలంగాణలో పట్టభద్రులు బిఆర్ఎస్ కు అనుకూలంగా లేరన్న అభిప్రాయంతో బీఆర్ఎస్ ఉందా? ఓవైపు కాంగ్రెస్ గ్రాఫ్ పడిపోయిందని స్వయంగా చెబుతున్న కేసీఆర్ ఈ ఎన్నికల్లో పాల్గొనకపోవడం ద్వారా ఎవరి గ్రాఫ్ బాగుందని చెప్పదలుచుకున్నారు? ఎమ్మెల్సీ ఎన్నికల విధానానికి వ్యతిరేకమైతే ఇటీవల వరంగల్, ఖమ్మం, నల్లగొండ గ్రాడ్యుయేట్ నియోజకవర్గం నుండి బీఆర్ఎస్ పోటీచేసింది. బీఆర్ఎస్ ఓటమి నుండి ఇంకా తేరుకోలేదా? వ్యూహాల్లో తడబడుతుందా? అన్నదానిపై విశ్లేషణలు సాగుతున్నాయి.

- తాజా రాజకీయ పరిణామాలపై ఎఎన్ఎన్ సిఈవో, జర్నలిస్ట్ కంది రామచంద్రారెడ్డి వీకెండ్ ఎనాలసిస్

ఎడిటోరియల్ పేజీ 4లో ▸



టన్నెల్ ప్రమాదంపై రాహుల్ గాంధీ దిగ్భ్రాంతి

- మనోవేదనకు గురయ్యా
- సొరంగంలో చిక్కుకున్న వారితో కుటుంబాలున్నాయి
- సాధ్యమైన సహాయక చర్యలన్నీ జరుగుతున్నాయని తెలిసింది

వివరాలు 3లో ▸



# ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో ప్రమాదం

**సొరంగంలో చిక్కుకున్న 8 మంది**

సురక్షితంగా బయటపడ్డ 42మంది.. 3 మీటర్ల వరకు కుంగిన పైకప్పు

రిటైనింగ్ వాల్ కడుతుండగా ఘటన.. నాగర్ కర్నూల్ జిల్లా దోమలపెంట వద్ద ఘటన

స్పందించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ.. ముఖ్యమంత్రి రేవంత్ కు ఫోన్

సహాయక చర్యలపై ఉదయమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు

సమాచారం తెలిసిన వెంటనే ఘటనా స్థలానికి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

ఆర్మీని రంగంలోకి దింపిన ఉత్తమ్ సహాయక చర్యలు ముమ్మరం

**హైదరాబాద్, నాగర్ కర్నూల్, మహా :** శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ టన్నెల్ లో ప్రమాదం జరిగింది. నాగర్ కర్నూల్ జిల్లా దోమలపెంట సమీపంలో టన్నెల్ రిటైనింగ్ వాల్ కడుతుండగా 14వ కిలో మీటర్ వద్ద 3 మీటర్ల మేర కుంగిపోయింది. శనివారం ఉదయం సొరంగ మార్గం వద్ద సుమారు మూడు మీటర్ల మేర పై కప్పు కుంగింది. రిటైనింగ్ వాల్ కూలి టన్నెల్‌లో రింగులు విరిగిపడడంతో.. విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఈ ఘటనలో పది మంది కార్మికులు గాయపడ్డారు. బాధితులను హుటాహుటిన ఆస్పత్రికి తరలించి చికిత్సలు చేయిస్తున్నారు.

మిగతా 2లో ▸



### సహాయక చర్యలు చేపట్టండి: సీఎం రేవంత్ రెడ్డి

నాగర్ కర్నూల్ జిల్లా దోమలపెంటలో ఎస్ఎల్బీసీ వద్ద చోటు చేసుకున్న ప్రమాదంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విచారం వ్యక్తం చేశారు. వెంటనే జిల్లా అధికారులను అప్రమత్తం చేశారు. జిల్లా కలెక్టర్. ఎస్పీ, అగ్నిమాపక శాఖ, హైడ్రా, ఇరిగేషన్ విభాగం అధికారులు వెంటనే అక్కడికి చేరుకొని సహాయక చర్యలు అందించాలని సీఎం ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. ఇరిగేషన్ సలహాదారు ఆదిత్య నాథ్ దాస్, ఇరిగేషన్ అధికారులు ప్రత్యేక హెలీకాప్టర్ లో ప్రమాదం జరిగిన ప్రాంతానికి బయలుదేరారు.



# బీసీ కులగణనపై బీజేపీ కుట్ర

**రాహుల్ గాంధీ ఆదేశంతోనే కులగణన నిర్ణయం**

రాహుల్ పీఎం అయితే దేశ వ్యాప్తంగా కులగణన తథ్యం

మోదీ వద్దంటున్నాడని బీజేపీ నేతలు అడ్డుకుంటున్నారు

బీసీ సంఘాల సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి


నేను దేశంలో ఎవరూ చేయని సాహసం చేస్తే.. నాకు మద్దతునియ్యట్లే

అడ్డంపడ్డోళ్ళకు.. మద్దతుగా ఉంటున్నరు.. విలన్‌ను చేస్తున్నరు

సమావేశంలో టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి పొన్నం

**మహా :** రాష్ట్రంలో బీసీ కులగణన సర్వే చేపట్టడం ద్వారా చారిత్రాత్మక నిర్ణయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుందని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. కులగణన విషయంలో భవిష్యత్‌లో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. ప్రధాని మోదీకి చిత్తశుద్ధి ఉంటే జనగణనలో కుల గణన కూడా చేయాలని సీఎం రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. మోదీకి కులగణన ఇష్టం లేదు కాబట్టే రాష్ట్రంలో కిషన్‌రెడ్డి, బండి సంజయ్ వద్దని అంటున్నారని సీఎం ధ్వజమెత్తారు. బీసీ కులగణనపై ప్రతిపక్షాల నుంచి పలు సందేహాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఈ మేరకు

మిగతా 2లో ▸



## భానుడి భగభగ

**మార్చి నుండి జాగ్రత్త**

**హెచ్చరిస్తున్న వాతావరణ శాఖ**

**మహా :** ఎండలు దంచి కొడుతున్నాయి. ప్రతి సంవత్సరం మార్చి నెల నుంచి ఎండ ప్రభావం కనిపిస్తే ఈ సంవత్సరం శివరాత్రి రాకముందే ఎండ మొదలైంది. శివరాత్రికి శివ శివ అంటూ చలి పోతుంది అని చెప్తారు కానీ ఇప్పుడే చలి పోయి, భానుడు ఉగ్రరూపం దాలుస్తున్నాడు.

మిగతా 2లో ▸

## పూర్తి బాధ్యత సీఎందే

**ఎస్ఎల్‌బీసీ సొరంగం ఘటన బాధాకరం: కేటీఆర్**



**మహా:** ఎస్ఎల్‌బీసీ సొరంగం ఘటనపై పూర్తి బాధ్యత సీఎం రేవంత్ రెడ్డిదేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. సుంకిశాల రీటైనింగ్ వాల్ కూలిన ఘటన మరువకముందే మరో దుర్ఘటన జరగడం బాధకరమన్నారు. ఇది కాంగ్రెస్ సర్కారు వైఫల్యానికి నిదర్శనమంటూ హరీష్‌రావు సైతం మండిపడ్డారు.



కుషాయిగూడలో దారుణం

**నడిరోడ్డుపై తండ్రిని చంపిన కొడుకు**

అందరూ చూస్తుండగానే అతి కిరాతకంగా హత్య

వివరాలు 3లో ▸

## కేసీఆర్ పాలనలో వ్యవస్థలు నాశనం

**రేవంత్ పాలనపై చర్చకు సిద్ధం.. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి**




**మహా :** కేసీఆర్ పాలనలో వ్యవస్థలన్నీ నాశనమయ్యాయని, బంగారు తెలంగాణ చేస్తానని తన కుటుంబాన్ని బంగారంగా మార్చుకున్నారని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. మండలిలో ఉపాధ్యాయులకు ప్రాధాన్యం తగ్గించారని గుర్తుచేశారు. పట్టభద్రుల ఎన్నికల సందర్భంగా నిజామాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ.. నిరుద్యోగులను కాంగ్రెస్ ప్రభుత్వం కూడా మోసం చేసిందన్నారు. అధికారంలోకి వస్తే నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి మర్చిపోయిందని, ప్రతి ఏడాది జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామన్న హామీని విస్మరించిందని పేర్కొన్నారు.

మిగతా 2లో ▸

## స్వర్ణ విమాన గోపురం రికార్డు

**దేశంలోనే తొలి ఆలయం యాదగిరిగుట్టే**



రూ.70 కోట్ల వ్యయంతో ఎత్తయిన విమానగోపురం

నేడు మహాకుంభాభిషేకం.. హాజరుకానున్న సీఎం రేవంత్

మాజీ సీఎం కేసీఆర్ కు కూడా ఆహ్వానం

వివరాలు 2లో ▸

# మంత్రి సీతక్క సంతకం

**14,236 ఉద్యోగాల భర్తీకి గ్రీన్ సిగ్నల్**

రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఇదే భారీ రిక్రూట్ మెంట్

జిల్లాల వారీగా నోటిఫికేషన్లు జారీచేయనున్న కలెక్టర్లు

6399 అంగన్వాడీ టీచర్లు..7837 హెల్పర్ల పోస్టులు

**హైదరాబాద్, మహా:** తెలంగాణలో 6399 అంగన్వాడీ టీచర్లు, 7837 హెల్పర్ల పోస్టులు.. అంటే మొత్తంగా 14,236 ఉద్యోగాల భర్తీకి రంగం సిద్ధమైంది. ఎన్నికల కోడ్ ముగియగానే ఇందుకు సంబంధించిన నోఫికేషన్ జారీ కానుంది. ఇందుకు సంబంధించిన ఫైల్ పై మంత్రి సీతక్క శనివారం సంతకం చేశారు. సీతక్క సంతకంలో తెలంగాణ ప్రభుత్వం మరో భారీ ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేసేందుకు రెడీ అయింది.

మిగతా 2లో ▸



# పోలీస్ శాఖ అవసరాలు తీరుస్తాం

**దేశంలో తెలంగాణ పోలీస్‌కు మంచి పేరు ఉంది**



రాష్ట్రం సమగ్రాభివృద్ధి చెందుతుంది..

ఆ మేరకు భద్రత పెరగాలి

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

వివరాలు 2లో ▸

# బీజేపీ అంటే బీసీల పార్టీ

## మంత్రి పదవి ముఖ్యం కాదు నాకు ప్రజలే ముఖ్యం

### నమ్మక ద్రోహానికి...పోరాటానికి మధ్య జరుగుతున్న ఎన్నికలివి

### బీసీ జాబితాలో ముస్లింలను చేర్చి బీసీకు ద్రోహం చేస్తున్న కాంగ్రెస్

### ఇప్పుడు బీసీ జపం చేస్తే నమ్మి మోసపోదామా?

### ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో కేంద్ర మంత్రి బండి సంజయ్



**మహా :** నమ్మక ద్రోహం నయవంచనకు - పోరాటాలకు, ధర్మ రక్షణకు మధ్య ఎమ్మెల్సి ఎన్నికలు జరగబోతున్నాయని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ వ్యాఖ్యానించారు. 6 గ్యారంటీలతో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన నయ వంచన, నమ్మక ద్రోహానికి తగిన గుణపాఠం చెప్పాలని గ్రాడ్యుయేట్, టీచర్లకు పిలుపునిచ్చారు. బీజేపీ అభ్యర్థులు గెలిచిన వారం రోజుల్లోనే దీక్షలు, ఉద్యమాలతో కాంగ్రెస్ సర్కార్ పై యుద్ధం ఆరంభిస్తామని ప్రకటించారు. తనకు కేంద్ర మంత్రి పదవి ముఖ్యం కానేకాదని, ప్రజలే తనకు ముఖ్యమన్నారు. మంత్రిగా ఉంటూ గ్రూప్ 1 అభ్యర్థుల పక్షాన హైదరాబాద్ లో ఉద్యమించిన విషయాన్ని గుర్తు చేశారు. బీసీ జాబితాలో ముస్లింలను చేర్చి బీసీలకు వెన్నుపోటు పొడిచిన కాంగ్రెస్ పార్టీ ఇవ్వాళ బీసీ జపం చేయడం సిగ్గు చేటన్నారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పచ్చీస్ ప్రభారీల సమావేశంలో బండి సంజయ్ తోపాటు ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, వెంకటరమణారెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల అధ్యక్షులు గంగాడి క్రిష్ణారెడ్డి, గోపి, మాజీ మేయర్లు సునీల్ రావు, డి.శంకర్, వాసాల రమేశ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్ ప్రసంగిస్తూ, బీజేపీ నాయకత్వం ఏ అభ్యర్థిని నిలబెట్టినా గెలిపించే బాధ్యత మాదేనని నిరూపిస్తూ ఇంత పెద్ద సంఖ్యలో విచ్చేసిన కార్యకర్తలకు అభినందనలు అన్నారు. మెమ్మెల్సీ ఎన్నికల ఫలితాలతో రాష్ట్ర రాజకీయాల్లో పెనుమార్పులు రావడం తథ్యమని, ప్రజలు బీజేపీకి ఓటేయడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. టీచర్, గ్రాడ్యుయేట్ ఓటర్ల ఇంటింటికీ వెళ్లి ఓట్లు వేసేలా కష్టపడాలని, ఎందుకంటే ఓటు అడిగే అర్హత బీజేపీకి మాత్రమే ఉందన్నారు. బీజేపీ గెలుపును కూడా ఎవ్వరూ ఆపలేరని, అన్ని సర్వేల్లోనూ అంజిరెడ్డి ముందస్తులో ఉన్నారన్నారు. రెండో స్థానం కోసమే కాంగ్రెస్, ఇండిపెండెంట్ అభ్యర్థులు పోటీ పడుతున్నారన్నారు.

నిరుద్యోగులు, ఉద్యోగ, ఉపాధ్యాయుల పక్షాన నిలదీస్తుందెవరు? మీ కోసం జైలుకు పోయిందెవరు? మీ కోసం లాఠీ దెబ్బలు తిన్నదెవరు? మీ కోసం రక్తం చిందించిందెవరు? పీఆర్సీ కోసం, డీఏల కోసం, బదిలీలు, ప్రమోషన్లు, గ్రూప్ 1 అభ్యర్థుల పక్షాన కొట్లాడి కాళ్లు చేతులు విరగ్గొందెవరు.... బీజేపీ కార్యకర్తలు కాకుండా ఇంకెవరైనా మీ పక్షాన పోరాటాలు చేశారా? నన్ను జైలుకు పంపేందుకు హిందీ పేపర్ లీక్ చేశారని అపవాదు వేసిన సంఘటనను మర్చిపోయారా? కేంద్ర మంత్రిగా ఉంటూ గ్రూప్ 1 అభ్యర్థుల పక్షాన పోరాడిన. ఎందుకంటే నాకు మంత్రి పదవి ముఖ్యం కానేకాదు... నాకు ప్రజలే ముఖ్యం. వాళ్ల సమస్యల పరిష్కారమే ముఖ్యం. అందుకోసం ఎందాకైనా తెగిస్తా. రోడ్డెక్కి కొట్లాడేందుకు సిద్ధం... ఎమ్మెల్సీ ఎన్నికలు ఇజ్జత్ కా సవాల్... భారీ మెజారిటీతో గెలిచి తీరాలి. అందుకోసం కార్యకర్తలంతా సోషల్ మీడియాను విస్తృతంగా వాడుకోవాలని కోరారు.

# బీసీ కులగణనపై బీజేపీ కుట్ర

(మొదటిపేజీ తరువాయి)

ప్రజాభవన్‌లో బీసీ నేతలతో సీఎం రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. రాహుల్‌గాంధీ ఆశయం మేరకు తమ ప్రభుత్వం సమగ్రమైన కులగణన చేపట్టిందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా కులగణన చేయాల్సిన అవశ్యకత ఏర్పడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. రాహుల్‌గాంధీ ప్రధాని అయితే అన్ని రాష్ట్రాల్లో కులగణన జరిగి తీరుతుందని సీఎం జోస్యం చెప్పారు. కులగణనను కాపాడుకోకపోతే బీసీలే నష్టపోతారని రేవంత్ రెడ్డి వివరించారు. కులగణనను ఇంత పకడ్బందీగా నిర్వహించిన రాష్ట్రం మరొకటి ఉండదని వివరించారు. కులగణన నివేదిక ఆధారంగా బీసీల కోసం చేపట్టాల్సిన సామాజిక, ఆర్థిక, రాజకీయ కార్యాచరణపై సూచనలు ఇవ్వాలని సీఎం కోరారు. బీసీల జనాభా ప్రకారం వారికి అవకాశాలు కల్పించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని మరోసారి స్పష్టం చేశారు. రెండో విడత పూర్తి కాగానే నివేదికకు చట్టబద్ధత కల్పిస్తామని రేవంత్ రెడ్డి వివరించారు. భవిష్యత్‌లో ఎవరూ కోర్టుకు వెళ్లకుండా చూసేందుకే రెండో అవకాశం ఇచ్చామన్నారు. కులగణన సర్వేలో ఎక్కడ తప్పులు జరిగాయో నిరూపించాలని రేవంత్ సవాల్ విసిరారు. అసెంబ్లీలో పెట్టి చట్టబద్ధత కల్పించడంతో తన బాధ్యత నెరవేరుతుందన్నారు. జనాభా దామాషా ప్రకారం ఏం కోరుకుంటున్నారో బీసీలే చెప్పాలని కోరారు. దాదాపు కోటి 12 లక్షలకు పైగా కుటుంబాలు కులగణనలో పాల్గొన్నాయని రేవంత్ రెడ్డి వివరించారు. కులగణన 96.9 శాతం జరిగింది 3.1 శాతం సర్వే రాలేదని వివరించారు. ఇంత పారదర్శకంగా కులగణన చేపడుతున్నా కొంతమంది నాయకులు ఇంకా చేయించుకోలేదు. కేసీఆర్, హరీష్, కేటీఆర్ మాట్లాడుతున్నరు గానీ.. ఆన్ లైన్ లో కూడా వివరాలు నమోదుచేయట్లే. జనాభా లెక్కల్లో లేని వారి ఇళ్ళముందు డప్పుకొట్టాలి. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి కులగణన ప్రయత్నమే చేయలేదని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

**బీసీల లెక్క తేలితే మాకేంటి అంటున్నారు**

కేసీఆర్ హయాంలో చేసిన సమగ్ర కుటుంబ సర్వేలో 4 కేటగిరీలుగానే జనాభా శాతాన్ని చెప్పారన్న సీఎం కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వేలో 5 కేటగిరీలు ఉన్నాయని రేవంత్ వివరించారు. ముస్లింలలో ఓబీసీలను నాడు కేసీఆర్ ప్రభుత్వం విడిగా చెప్పలేదని దుయ్యబట్టారు. బీసీల లెక్క తేలితే మాకేంటి అని ఆ వర్గం అడుగుతారని బీజేపీ, బీఆర్ఎస్ భయపడుతోందని తెలిపారు. చారిత్రాత్మకమైన, సాహసోపేతమైన నిర్ణయాన్ని కాంగ్రెస్ తెలంగాణ ప్రభుత్వం తీసుకుందని రేవంత్ పేర్కొన్నారు. ముస్లింల సాకుతో బీసీలకు న్యాయం జరుగకుండా బీజేపీ ప్రయత్నిస్తుందని, ఈ విషయాన్ని గ్రహించాల్సిన అవసరం ఉందన్నారు. కులగణన తేలితే పథకాల అమలు, బడ్జెట్ లో నిధుల కేటాయింపు, రాజకీయపరంగా రావాల్సిన అవకాశాలు తదితరాలపై స్పష్టత వస్తుందని, అయితే ఇవేవీ పట్టించుకోకుండా బీజేపీ, బీఆర్ఎస్ లు లేనిపోని వివాదాలను తెరపైకి తీసుకు వచ్చి బీసీలలో అనుమానాలను రేకెత్తించేందుకు ప్రయత్నిస్తున్నాయని మండిపడ్డారు. బీజేపీ, బీఆర్ఎస్ ల కుట్రను బీసీలందరూ గ్రహించాల్సిన అవసరం ఉందని సీఎం పేర్కొన్నారు. ఎన్నో ఏళ్ళుగా కులగణన జరగాలన్న డిమాండ్ ఉందని, రాహుల్ గాంధీ కూడా నిరాధరణకు గురైన కులాలకు ప్రాతినిధ్యం కల్పించడంతో పాటు జనాభా దామాషా ప్రకారం నిధుల కేటాయింపు జరగాలన్న ఆలోచనతో కులగణనకు ఆదేశించారని, రాహుల్ గాంధీ ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకుని ముందుకు వెళ్ళడం జరిగిందన్నారు. సమావేశంలో టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పోరేషన్ చైర్మన్ లు, బీసీ సంఘాల నేతలు పాల్గొన్నారు.

# భానుడి భగభగ

(మొదటిపేజీ తరువాయి)

ఈ ఏడాది ఫిబ్రవరి మొదటి వారం నుంచి మండుతున్న ఎండలు ఎండాకాలం పైన జనాలకు భయాన్ని పెంచుతున్నాయి. తెలుగు రాష్ట్రాలలో భానుడి ఉగ్రరూపం ఉదయం 8 గంటల నుంచి వేడి వాతావరణం ప్రారంభమవుతుంది. మధ్యాహ్నం మూడు గంటలకు భానుడు భగభగ మండుతూ తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. ఇక రాబోయే రోజులలో తెలుగు రాష్ట్రాలలో భానుడు నిప్పులు చెరుగుతాడని భారత వాతావరణ శాఖ తెలిపింది. ఇదిలా ఉంటే తెలంగాణ రాష్ట్రంలో మార్చి 1వ తేదీ నుండి ఎండ తీవ్రత చాలా ఎక్కువగా ఉండే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. శుక్రవారం రాష్ట్రంలో 35.3° నుండి 38.2° వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పెంచికల్ పేటలో అత్యధికంగా 38.2° ఉష్ణోగ్రతలు, జగిత్యాల బీర్పూర్ లో 38.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు, నిర్మల్ జిల్లా గింగాపూర్ లో 38.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు, నాగర్ కర్నూలు జిల్లా పెద్ద ముద్నూరులో 38 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇక భవిష్యత్తులో భానుడి ప్రతాపం మరింత పెరుగుతుందని అంటున్నారు. తూర్పు, ఆగ్నేయ గాలుల వలన పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు పెరుగుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేస్తుంది. ప్రతి సంవత్సరం ఈ సమయంలో నమోదయ్యే సాధారణ ఉష్ణోగ్రతల కంటే మూడు నాలుగు డిగ్రీల మేర ఎక్కువగా ఈ సంవత్సరం ఉష్ణోగ్రతలు రికార్డు అవుతున్నాయి. ఇక వాతావరణంలో తేమశాతం తగ్గడంతో ప్రజలు ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్నారు. గతానికి భిన్నంగా వాతావరణం తయారైంది. మరోవైపు సీజనల్ వ్యాధులు కూడా ప్రబలే అవకాశం ఉండడంతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.

# మంత్రి సీతక్క సంతకం



(మొదటిపేజీ తరువాయి)

మహిళా శిశు సంక్షేమ శాఖలో అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ల ఖాళీల భర్తీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. 6399 అంగన్వాడీ టీచర్లు, 7837 హెల్పర్ల పోస్టులు.. అంటే మొత్తంగా 14,236 ఉద్యోగాల భర్తీకి రంగం సిద్ధమైంది. ఎన్నికల కోడ్ ముగియగానే ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్లు జారీ కానున్నాయి. నోటిఫికేషన్లను జిల్లాల వారీగా కలెక్టర్లు జారీ చేయనున్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఇంత పెద్ద మొత్తంలో అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ల ఉద్యోగాలను భర్తీ చేయడం ఇదే తొలిసారి అని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ఈ ఖాళీలను భర్తీ చేస్తే అంగన్వాడీ కేంద్రాలు మరింత పటిష్టంగా మహిళలు, చిన్నారులకు సేవలు అందిస్తాయన్న అభిప్రాయాన్ని ప్రభుత్వ వర్గాలు వ్యక్తం చేస్తున్నాయి.

**సీతక్క పట్టుతో ...**

మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రిగా సీతక్క పట్టుబట్టి , ముఖ్యమంత్రిని ఒప్పించి పోస్టుల భర్తీని సాధించారు. తెలంగాణ రాష్ట్రంలో మొత్తం 140 ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. ఆయా ప్రాజెక్టుల పరిధిలో మొత్తం 35,700 అంగన్వాడీ కేంద్రాలు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. మొత్తం 35,700 అంగన్వాడీ కేంద్రాల్లో 31,711 ప్రధాన అంగన్వాడీ కేంద్రాలు కాగా.. మిగతా 3,989 మినీ అంగన్వాడీ కేంద్రాలుగా కొనసాగుతున్నాయి. ప్రతీ అంగన్వాడీ కేంద్రంలో ఒక టీచర్ తో పాటు ఒక హెల్పర్ ఉంటారు. మినీ అంగన్వాడీ కేంద్రంలో మాత్రం ఒక టీచర్ మాత్రమే ఉంటారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మినీ అంగన్వాడీ కేంద్రాలను పూర్తిస్థాయి అంగన్వాడీ కేంద్రాలుగా అప్ గ్రేడ్ చేసింది. దీంతో అక్కడ హెల్పర్ పోస్టులను మంజూరు చేశారు. ఈ నియామకాలతో గ్రామాల్లో అంగన్ వాడీల రూపురేఖలు మారడంతో పాటు ఉద్యోగ ఉపాధి అవకాశాలు పెరగనున్నాయి.



# అసెంబ్లీకి జగన్


## సూపర్ 6కి కేటాయించిన నిధుల తీరుపై ప్రశ్నించాలని జగన్ భావిస్తున్నట్లు సమాచారం

### ఏపీ రాజకీయాల్లో చర్చ

**మహా:** మాజీ సీఎం జగన్ సోమవారం నుండి జరగబోయే అసెంబ్లీ సమావేశాలకు హాజరు కావాలని సంచలన నిర్ణయం తీసుకున్నారు. జగన్ తో పాటు వైసీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సైతం అసెంబ్లీకి హాజరుకానున్నారు. ఈ సమావేశాలకు హాజరై కూటమి సర్కార్ హామీలపై సూపర్ 6కి కేటాయించిన నిధులు, అమలు తీరుపై ప్రశ్నించాలని జగన్ భావిస్తున్నట్లు సమాచారం. తద్వారా ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాలన్నది జగన్ వ్యూహమన్న చర్చ ఏపీ రాజకీయాల్లో జరుగుతోంది.

# సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన కోనేరు కోనప్ప

## చివరి వరకూ కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతానని స్పష్టీకరణ




**హైదరాబాద్, మహా:** సిర్పూర్ కాగజ్ నగర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిశారు. మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డితో కలిసి ఆయన ముఖ్యమంత్రిని కలిశారు. అనంతరం ఆయన పార్టీ మార్పుపై వివరణ ఇచ్చారు. తాను కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి, బీఆర్ఎస్‌లో చేరబోతున్నట్లు జరిగిన ప్రచారాన్ని ఖండించారు. తాను చివరి వరకూ కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతానని అన్నారు. కోనేరు కోనప్ప కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి, బీఆర్ఎస్‌లో చేరనున్నట్లు నిన్న జోరుగా ప్రచారం సాగింది. అయితే, ఈరోజు ఆయన ముఖ్యమంత్రిని కలవడం ప్రాధాన్యత సంతరించుకుంది. కోనేరు కోనప్ప 2014 ఎన్నికల్లో బీఎస్పీ నుండి పోటీ చేసి నాటి బీఆర్ఎస్ అభ్యర్థి కావేటి సమ్మయ్యపై విజయం సాధించారు. ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ పార్టీలో చేరారు. 2018లో మరోసారి బీఆర్ఎస్ నుండి పోటీ చేసి గెలిచారు. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి పాల్వాయి హరీశ్ చేతిలో ఓడిపోయారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ బీఆర్ఎస్‌లో చేరడంతో కోనేరు కోనప్ప అసంతృప్తితో కాంగ్రెస్ పార్టీలో చేరారు.




# విమానంలో విరిగిన సీటు

- ఆ సీట్లోనే కూర్చుని ప్రయాణం చేసిన కేంద్రమంత్రి
- క్షమాపణలు చెప్పిన ఎయిర్ లైన్స్ సంస్థ
- ట్వీట్ ద్వారా వెల్లడించిన శివరాజ్ సింగ్ చౌహాన్

**మహా :** విమాన ప్రయాణంలో కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కు చేదు అనుభవం ఎదురైంది. ఎయిరిండియా విమానంలో ఆయన విరిగిన సీటులో కూర్చుని గంటన్నర పాటు ప్రయాణించాల్సి వచ్చింది. శివరాజ్ సింగ్ చౌహాన్ కొన్ని రోజుల కిందట భోపాల్ నుంచి ఢిల్లీ ప్రయాణించారు. ఎయిరిండియా విమానం ఎక్కిన ఆయన తాను బుక్ చేసుకున్న సీటు విరిగిపోయి ఉండడాన్ని గుర్తించారు. దాంతో ఆయన విమాన సిబ్బందిని పిలిచి, సీటు విరిగిపోయిన విషయం వారికి తెలియజేశారు. విమానంలో ఇదొక్కటే కాదు... మరి కొన్ని సీట్లు కూడా విరిగిపోయి ఉన్నాయన్న సమాధానం వారి నుంచి వినిపించింది. ఈ విషయం మేనేజ్‌మెంట్ కు కూడా తెలుసని, విరిగిన సీటును ఎవరికీ కేటాయించవద్దని ఆదేశాలు కూడా ఉన్నాయని వారు కేంద్రమంత్రికి తెలిపారు. కాగా, ఆ విమానంలో తాను పడుతున్న ఇబ్బందిని గమనించి ఇతర ప్రయాణికులు తమ సీట్లలో కూర్చోవాలని ఆఫర్ చేశారని, అయితే వారిని ఇబ్బంది పెట్టడం ఎందుకన్న ఉద్దేశంతో విరిగిన సీటులోనే కూర్చుని ఢిల్లీ వచ్చానని కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ వివరించారు. ఎయిరిండియా సంస్థను టాటా గ్రూప్ హస్తగతం చేసుకున్నాక, ఆ విమానయాన సంస్థ పరిస్థితులు బాగుపడతాయని భావించానని, కానీ, అది తన భ్రమ అని ఇప్పుడు అర్థమైందని వ్యాఖ్యానించారు. ఓ టికెట్ కు పూర్తి ఛార్జీ వసూలు చేసినప్పుడు, ఇలాంటి విరిగిపోయిన సీట్లు కేటాయించడం మోసపూరితం కాదా అని శివరాజ్ సింగ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ట్వీట్ చేశారు. కేంద్రమంత్రి ట్వీట్ పై ఎయిరిండియా స్పందించింది. ఆయనకు క్షమాపణలు తెలియజేసింది. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా చూసుకుంటామని వెల్లడించింది.

# స్వర్ణ విమాన గోపురం రికార్డు

## దేశంలోనే తొలి ఆలయం యాదగిరిగుట్టే

### రూ.70 కోట్ల వ్యయంతో ఎత్తయిన విమానగోపురం

### నేడు మహాకుంభాభిషేకం.. హాజరుకానున్న సీఎం రేవంత్ రెడ్డి

### మాజీ సీఎం కేసీఆర్ కు కూడా ఆహ్వానం



**హైదరాబాద్, మహా:** భారతదేశంలోనే తొలి ఆలయంగా యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం రికార్డు నమోదుచేయనుంది. తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో మహా కుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆదివారం దేవస్థాన స్వర్ణ విమాన గోపురానికి మహా కుంభాభిషేకం జరపనున్నారు. ఈ కార్యక్రమానికి ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డిని ఆలయ పూజారులు ఆహ్వానించగా.. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కి కూడా ఆహ్వానం అందజేశారు. మార్చి 1 నుంచి 11 వరకు జరిగే యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలకు సైతం హాజరు కావాల్సిందిగా కేసీఆర్‌ను ఆలయ పూజారులు కోరారు. అయితే.. కేసీఆర్ హయాంలో యాదగిరిగుట్టను పునర్మిర్మాణం చేసి.. అత్యంత సుందరంగా తీర్చిదిద్దారు. ఆలయ విమాన గోపురానికి స్వర్ణ తాపడం పనులను కేసీఆర్ హయాంలోనే మొదలు పెట్టగా.. ఆ పనులు ఇప్పుడు పూర్తయ్యాయి. ఆదివారం స్వర్ణ విమాన గోపురానికి మహాకుంభాభిషేకం నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

## గోపురం ప్రత్యేకతలివే

స్వర్ణ విమాన గోపురం ఎత్తు 50.5 అడుగులు కాగా.. గోపురం వైశాల్యం 10,759 చదరపు అడుగులు అని ఆలయాధికారులు తెలిపారు. గోపురానికి స్వర్ణతాపడానికి మొత్తంగా 68 కిలోల బంగారాన్ని ఉపయోగించారు. డిసెంబరు ఒకటో తేదీ, 2024లో స్వర్ణ తాపడం పనులు ప్రారంభించగా.. ఫిబ్రవరి 18, 2025న తాపడం కవచాల బిగింపు పనుల పూర్తయ్యాయి. అయితే.. బిగింపు పనులకు అయిన ఖర్చు మాత్రం.. రూ.5.10 కోట్లు. రాగి రేకులకు అయిన ఖర్చు రూ.12 లక్షలు. మొత్తంగా.. సుమారు రూ.70 కోట్ల వరకు ఖర్చయినట్టు అధికారులు అంచనా వేశారు. దేశంలోనే మొట్టమొదటి ఎత్తైన స్వర్ణ గోపురంగా ఈ ఆలయం రికార్డుకెక్కింది . యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం బంగారు విమాన గోపుర మహా కుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవంలో పాల్గొనాల్సిందిగా సీఎం రేవంత్ రెడ్డికి.. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, దేవాదాయ శాఖ కార్యదర్శి శైలజా రామయ్యర్, ఆలయ ఈవో, అర్చకులు.. కోరారు. వానమామలై మఠం 31వ పీఠాధిపతి రామానుజ జీయర్‌స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో ఈ మహోత్సవం నిర్వహించనున్నారు.

# ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్‌లో ప్రమాదం

(మొదటిపేజీ తరువాయి)



మరో ఎనిమది మంది ఆచూకీ తెలియడం లేదని బాధిత కార్మికులు తెలిపారు. ఆ సమయంలో సొరంగంలో యాభై మంది వరకు ఉన్నారంటున్నారు. వారిని బయటికి రప్పించేందుకు అధికారులు హుటాహుటిన సహాయ చర్యలు ప్రారంభించారు. ఇదిలా ఉండగా ప్రమాదం విషయం తెలుసుకున్న నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హుటాహుటిన దోమల పెంట బయల్దేరి వెళ్లారు. మంత్రి జూపల్లి కూడా సంఘటనా స్థలానికి వెళ్లారు. ఐదేండ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఈ మధ్య ఎస్ఎల్బీసీ పనులు ప్రారంభమయ్యాయి. ప్రమాదంపై ఆరా తీసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నీటిపారుదల శాఖా మంత్రి ఉత్తమ్, అధికారులతో మాట్లాడారు. మరోవైపు ఎస్ ఎల్ బిసి ఘటనపై సీఎం రేవంత్‌కు ప్రధాని మోదీ ఫోన్ చేశారు. ప్రమాదంపై ఆరా తీయగా పూర్తి వివరాలను మోదీకి రేవంత్ వివరించారు . పూర్తిస్థాయి సహకారం అందించేందుకు కేంద్రప్రభుత్వం సిద్ధంగా ఉందని హామీ ఇచ్చారు.

**సొరంగంలో చిక్కుకున్న 8 మంది**

దోమలపెంట సమీపంలోని ఎస్ ఎల్ బిసి టన్నెల్‌లో ప్రమాదం జరిగింది. శ్రీశైలం ఎడమగట్టు కాలువ టన్నెల్ 14వ కిలోమీటర్ వద్ద... సొరంగంలో.. 3 మీటర్ల మేర పైకప్పు కూలింది. దీంతో ఇద్దరు కార్మికులకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. ఉదయం షిఫ్ట్ లో సొరంగంలో పనులకు 50 మంది లోపలికి వెళ్లారు. ఒక్కొక్కరిగా 42 మంది సొరంగం నుంచి కార్మికులు బయటకు వచ్చారు. మరో 8 మంది సొరంగంలో చిక్కుకుపోవడంతో... వారిని బయటకు తీసుకువచ్చేందుకు రక్షణ చర్యలు చేపట్టారు. కూలీలు పంజాబ్ , జమ్మూకశ్మీర్ , యూపీ వాసులుగా గుర్తించారు. సొరంగంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఎడమవైపు సొరంగం వద్ద 4 రోజుల కిందటే మళ్లీ పనులు మొదలయ్యాయి.

**8 మందిని కాపాడేందుకు ఆర్మీని రంగంలోకి దింపుతున్నాం: టన్నెల్ ప్రమాదంపై మంత్రి ఉత్తమ్**

ఎస్ఎల్బీసీ టన్నెల్‌లో 8 మంది చిక్కుకున్నారని, అందులో ఆరుగురు జేపీ అసోసియేట్ కార్మికులు, మరో ఇద్దరు ఇంజనీర్లు ఉన్నారని.. వారిని కాపాడేందుకు ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందిని రప్పిస్తున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. నాగర్ కర్నూల్ జిల్లా దోమలపెంట వద్ద శ్రీశైలం ఎడమగట్టు కాలువ ప్రమాద స్థలాన్ని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. శనివారం ఉదయం 8 గంటలకు కార్మికులు టన్నెల్ లోపలికి వెళ్లి.. 8.30 గంటలకు టన్నెల్ బోరింగ్ మిషన్ ఆన్ చేశారని తెలిపారు. టన్నెల్ బోరింగ్ మిషన్ ఆన్ చేశాకే ప్రమాదం జరిగిందన్నారు. టన్నెల్‌లో ఒకవైపు నుంచి నీరు లీక్ అయ్యి మట్టి కుంగిందని.. దీంతో అధికారులు ముందే అప్రమత్తమై కొందరు కార్మికులను బయటకు పంపించారని తెలిపారు. టీబీఎం ఆపరేటర్ ప్రమాదాన్ని ముందే పసి గట్టారని చెప్పారు. ప్రమాదంలో చిక్కుకున్న ఆ ఎనిమిది మందిని సురక్షితంగా బయటకు తెచ్చేందుకు సర్వశక్తులా ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఇప్పటికే రెస్క్యూ టీంలు రంగంలోకి దిగాయని.. ఆర్మీతో కూడా మాట్లాడామని పేర్కొన్నారు. సంఘటనా స్థలికి భారత సైన్యం రెస్క్యూ టీంలు చేరుకునే అవకాశం ఉందని చెప్పారు. టన్నెల్ ప్రమాద నిపుణులతో చర్చలు జరుపుతున్నామన్నారు. ఇటీవల ఉత్తరఖండ్‌లో ఈ తరహా సంఘటన చోటు చేసుకున్నప్పుడు పాల్గొన్న రెస్క్యూ టీంను ఇక్కడికి రప్పిస్తున్నామని అన్నారు. టన్నెల్‌లో చిక్కుకున్నవారిలో జార్ఖండ్, యూపీ వాసులు ఉన్నారని తెలిపారు. టన్నెల్ 14 కిలో మీటర్ల లోపల ఉన్నందున సహాయక చర్యలు సవాల్‌గా మారాయని పేర్కొన్నారు.

## ప్రభుత్వం ఏర్పడి ఒక్క వారం కూడా కాలేదు
# అప్పుడే విమర్శలా?

### అతిషికి ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా కౌంటర్
### ఇన్నేళ్లు ఏం చేశారో చూసుకోవాలని ఎద్దేవా



**మహా :** మా ప్రభుత్వం ఏర్పడి ఒక్క వారం కూడా గడవలేదని, కానీ అప్పుడే విమర్శలు చేస్తున్నారని ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా మండిపడ్డారు. కాంగ్రెస్ 15 ఏళ్లు, ఆమ్ ఆద్మీ పార్టీ 13 ఏళ్లు ఢిల్లీని పాలించాయని, ఇన్నేళ్లు ఏం చేశారో చూసుకోవాలని హితవు పలికారు. కానీ తాము పీఠం ఎక్కి ఒక వారం కూడా కాలేదు, తమపై విమర్శలు చేయడమేమిటని ప్రశ్నించారు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన మొదటి రోజే తాము కేబినెట్ సమావేశాన్ని ఏర్పాటు చేసి, ఆయుష్మాన్ భారత్ యోజనను అందుబాటులోకి తీసుకువచ్చామని వెల్లడించారు. దీంతో ప్రజలకు రూ.10 లక్షల మేరకు వైద్య సహాయం అందుతుందని తెలిపారు. ప్రజలకు రూ.10 లక్షల విలువ చేసే వైద్య సహాయాన్ని ఆమ్ ఆద్మీ పార్టీ అమలు చేయలేదని విమర్శించారు. పదమూడేళ్లు ఏమీ చేయని వారికి తమ ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు లేదన్నారు. నరేంద్ర మోదీ నేతృత్వంలో ఢిల్లీ తన హక్కులన్నింటినీ పొందుతుందన్నారు. ముందు మీరు మీ పార్టీ గురించి చూసుకోవాలని హితవు పలికారు. ఆమ్ ఆద్మీ పార్టీని ఎంతోమంది వీడాలనుకుంటున్నారని వ్యాఖ్యానించారు. కాగ్ నివేదికను అసెంబ్లీలో పెడితే అన్ని విషయాలు తెలుస్తాయని ముఖ్యమంత్రి అన్నారు. ఢిల్లీలో మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం అందించే పథకాన్ని మొదటి కేబినెట్ సమావేశంలో ఆమోదిస్తామని బీజేపీ హామీ ఇచ్చిందని, కానీ మొదటి రోజు దానిని ఉల్లంఘించిందని మాజీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకురాలు అతిషి ఆరోపించారు. అతిషి విమర్శలకు ముఖ్యమంత్రి రేఖా గుప్త కౌంటర్ ఇచ్చారు.



## బిడ్డా.. నా జోలికి వస్తే నీ చరిత్ర మొత్తం తీస్తా!

- మాజీ సీఎం కేసీఆర్ కొడుక్కి పని పాట లేదు
- కేటీఆర్ పై విరుచుకుపడ్డ బండి సంజయ్

**మహా:** మాజీ సీఎం కేసీఆర్ కొడుక్కి పని పాట ఏమీ లేదని కేంద్ర మంత్రి బండి సంజయ్ విమర్శించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్సీ అభ్యర్థులను నిలబెట్టడానికి బీఆర్ఎస్ పార్టీలో ఎవరూ గతిలేరని అన్నారు.దానిపై దృష్టి పెట్టకుండా.. నాపై ఎపుడూ ఏడుస్తారు.. అంటూ మండిపడ్డారు. కాళేశ్వరం కేసులో కేసీఆర్‌ను సీఎం ఎందుకు అరెస్ట్ చేయిస్తలేరని కేటీఆర్‌ను ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్, ఈఫార్ములా వన్, బావమరిది ఫామ్ హౌజ్ డ్రగ్స్ పార్టీ కేసుల్లో చర్యలు ఎందుకు తీసుకోలేదో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. బిడ్డా.. నా జోలికి వస్తే నీ చరిత్ర మొత్తం బయటపెడతా.. అంటూ కేటీఆర్ పై ఫైరయ్యారు.

# ముగ్గురు ఐపీఎస్‌లకు కేంద్రం షాక్

### ఇద్దరిని రిలీవ్ చేసిన తెలంగాణ ప్రభుత్వం
### కరీంనగర్ సీపీపై కొనసాగుతున్న సస్పెన్స్
### ఏపీకి కేటాయించిన తెలంగాణలోనే పని చేస్తున్న ఐపీఎస్ లు







**మహా :** తెలంగాణలోని ముగ్గురు ఐపీఎస్ అధికారులకు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ షాక్ ఇచ్చింది. ఏపీ కేడర్ కు కేటాయించినప్పటికీ తెలంగాణలోనే కొనసాగుతున్న అంజనీకుమార్, అభిలాష్ బిస్తా, అభిషేక్ మహంతిలను వెంటనే తెలంగాణ ప్రభుత్వం రిలీవ్ చేయాలని ఆదేశించింది. దీంతో రోడ్ సేఫ్టీ అథారిటీ డీజీగా పని చేస్తున్న అంజనీకుమార్ ను, తెలంగాణ రాష్ట్ర పోలీసు అకాడమీ సంచాలకులుగా పని చేస్తున్న అభిలాష్ బిస్తాను రిలీవ్ చేస్తూ ఉత్తర్వులను జారీ చేసింది. ప్రస్తుతం కరీంనగర్ సీపీగా పని చేస్తున్నఅభిషేక్ మహంతి విషయంలో ఈసీ అనుమతి కోసం ఎదురు చూస్తోంది రాష్ట్ర ప్రభుత్వం. అంజనీ కుమార్ ఏపీ క్యాడర్ ఐపీఎస్ అధికారిగా ఉన్నారు. తెలంగాణ డీజీపీగా కూడా పని చేశారు. రాష్ట్ర విభజన సమయంలో ఈ ముగ్గురు ఐపీఎస్ అధికారులను ఏపీకి కేటాయించబడ్డారు. అయితే, ట్రిబ్యునల్‌ను ఆశ్రయించిన వీరు తెలంగాణలోనే కొనసాగుతున్నారు. ప్రస్తుతం డీజీ ర్యాంకులో కొనసాగుతోన్న అంజనీకుమార్ రోడ్ సేఫ్టీ డీజీగా ఉండగా.. డీజీ ర్యాంక్‌లో ఉన్న మరో ఐపీఎస్ అధికారి అభిలాష్ బిస్తా పోలీస్ ట్రైనింగ్ డీజీగా ఉన్నారు. ఇక అభిషేక్ మహంతి ఎస్పీ ర్యాంకులో ఉన్నారు. అయితే, అంజనీ కుమార్, అభిలాష బిస్త్, అభిషేక్ మహంతిలను వెంటనే రిలీవ్ చేయాలని ఆదేశించి కేంద్ర హోంశాఖ.. వెంటనే ఏపీ క్యాడర్ లో రిపోర్ట్ చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఇంతకు ముందు కూడా ఏపీ కేడర్ కు చెందిన ఐఏఎస్ అధికారులను ఏపీ కి పంపించింది హోంశాఖ. ఐఏఎస్ అధికారులు ఆమ్రాపాలి, వాణీ ప్రసాద్, వాకాటి కారుణ, రొనాల్డ్ రాస్, ప్రశాంతిలు తెలంగాణను వదిలి వెళ్ళి ఏపీలో సేవలు అందిస్తున్నారు. ఇప్పుడు ముగ్గురు ఐపీఎస్ లను ఈ విధంగా రిలీవ్ చేయాలని చెప్పడంతో తెలంగాణ ప్రభుత్వం కూడా అదే వేగంతో రిలీవ్ చేయడం గమనార్హం. అభిషేక్ మహంతి కరీంనగర్ సీపీగా పని చేస్తుండటం, ఈ జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికలున్న నేపథ్యంలో ఈసీ ఆదేశాలను అనుసరించాల్సి ఉన్నందున రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆదేశాలను పంపి అనుమతి కోసం ఎదురు చూస్తోంది. ఈసీ స్పందనను బట్టి అభిషేక్ మహంతి బదలీ ఉంటుందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.

## పోలీస్ శాఖ అవసరాలు తీరుస్తాం

### దేశంలో తెలంగాణ పోలీస్ కు మంచి పేరు ఉంది

### రాష్ట్రం సమగ్రాభివృద్ధి చెందుతుంది.. ఆ మేరకు భద్రత పెరగాలి
### డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**మహా :** రాష్ట్రంలో ప్రతి పౌరుడు సురక్షితంగా జీవిస్తున్నారు అన్న భరోసాతో ఉండాలి, ఆ మేరకు పోలీసు శాఖ అవసరాలు తీర్చే బాధ్యత మేము తీసుకుంటామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. శనివారం సచివాలయంలో హోం శాఖ ఫ్రీ బడ్జెట్ సమావేశాల్లో ఆయన పలు అంశాలపై పోలీసు ఉన్నతాధికారులతో చర్చించారు. శరవేగంగా రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది, నగర రాజ్యముగ రాష్ట్రం స్థిరపడుతుందన్నారు. హైదరాబాదులో ప్రస్తుతం ఉన్న మూడు నగరాలకు తోడు నాలుగవ నగరం ఫ్యూచర్ సిటీ సైతం సిద్ధం అవుతుంది, రీజినల్ రింగ్ రోడ్డు పనులు వేగవంతం అవుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలో ఉన్న ఆర్థిక వనరులు, వాతావరణం, ఉపాధి అవకాశాల నేపథ్యంలో పెద్ద ఎత్తున హైదరాబాద్ కు, రాష్ట్రానికి వలసలు పెరుగుతున్నాయని ఈ మేరకు భద్రత విషయంలో హోం శాఖ సిద్ధం కావాల్సిన అవసరం ఉందని గుర్తు చేశారు. సరిహద్దుల్లో ఉండే సమస్యలపై ప్రత్యేకంగా దృష్టి సారించి పరిష్కరిస్తామని పోలీసు ఉన్నతాధికారులకు డిప్యూటీ సీఎం భరోసా ఇచ్చారు. దేశంలోనే తెలంగాణ పోలీస్ శాఖకు మంచి పేరు ఉంది, ప్రధానంగా సైబర్ క్రైమ్ కేసుల పరిష్కారం విషయంలో దేశంలో అగ్రస్థానంలో ఉన్నారుంటూ ఉన్నతాధికారులు, సిబ్బందికి డిప్యూటీ సీఎం అభినందనలు తెలిపారు. పోలీస్ అధికారులు, సిబ్బంది నివాసానికి క్వార్టర్స్ నిర్మించాల్సిన అవసరం ఉందని, రాష్ట్రంలో ఎక్కడెక్కడ పోలీస్ క్వార్టర్స్ నిర్మాణానికి అవకాశం ఉందో వెంటనే ప్రతిపాదనలు పంపించాలని డిప్యూటీ సీఎం పోలీస్ ఉన్నతాధికారులను కోరారు. సిఎస్ఆర్ నిధులు సమీకరించేందుకు అవకాశం ఉన్న ప్రతి చోట అధికారులు ప్రయత్నం చేయాలని, పోలీస్ శాఖ బలోపేతానికి వాటిని వినియోగించుకోవాలని సూచించారు. గత ఏడాది కాలంగా పోలీస్ శాఖలో భర్తీ చేసిన ఉద్యోగాల సంఖ్య, ప్రస్తుతం ఉన్న ఖాళీల వివరాలపైన సమీక్షించారు. గ్రేహౌండ్స్, నార్కోటిక్స్, ఇంటలిజెన్స్, ఫైర్, ఎక్స్ సర్వీస్ మెన్ మొత్తం ఎనిమిది విభాగాల ఉన్నతాధికారులు వారి బడ్జెట్ అవసరాల పై సమావేశంలో నివేదిక సమర్పించారు. డీజీపీ జితేంద్ర మొత్తం శాఖ పరంగా రానున్నఏడాదికి అవసరమైన బడ్జెట్ పై నివేదిక సమర్పించారు. సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, హోం శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ రవి గుప్తా, డీజీ అభిలాష్ బిస్త్, గ్రేహౌండ్స్, ఆక్టోపస్ అడిషనల్ డీజీ స్టీఫెన్ రవీంద్ర, హైదరాబాద్ సిటీ కమిషనర్ సీవీ ఆనంద్, రాచకొండ సీపీ సుధీర్ బాబు, సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి పాల్గొన్నారు.



## టన్నెల్ ప్రమాదంపై రాహుల్ గాంధీ దిగ్భ్రాంతి

### మనోవేదనకు గురయ్యా

- సొరంగంలో చిక్కుకున్న వారితో కుటుంబాలున్నాయి
- సాధ్యమైన సహాయకచర్యలన్నీ జరుగుతున్నాయని తెలిసింది

**మహా:** ఎస్ ఎల్బీసీ టన్నెల్ ప్రమాదంపై కాంగ్రెస్ నేత, ఎంపీ రాహుల్ గాంధీ ఎక్స్ ద్వారా స్పందించారు. ఈ సందర్భంగా ఆయన తన ట్వీట్ లో ఇలా రాసుకొచ్చారు. "తెలంగాణలో సొరంగం పైకప్పు కూలిపోవడం తో తీవ్ర మనోవేదనకు గురయ్యాను. ఈ క్లిష్ట సమయంలో నా ఆలోచనలు సొరంగం లోపల చిక్కుకున్న వారితో, వారి కుటుంబాలతో ఉన్నాయి. సహాయక చర్యలు కొనసాగుతున్నాయని, రాష్ట్ర ప్రభుత్వంతో పాటు విపత్తు సహాయక బృందాలు ఆపదలో ఉన్నవారిని త్వరితగతిన వెనక్కి తీసుకురావడానికి సాధ్యమైన ప్రతిదాన్ని చేస్తున్నాయని నాకు సమాచారం అందింది." అని అందులో పేర్కొన్నారు.

**రాహుల్ ను కలిసి మధుయాష్కీ**

ఎఐసిసి అగ్రనేత రాహుల్ గాంధీని మధుయాష్కీ శనివారం కలిశారు. రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిస్థితులు, బిసి కులగణనపై వివరించారు. ఇటీవల కాంలో ముఖ్యమంత్రి పనితీరుపై మధుయాష్కీ ప్రశంసలు కురిపిస్తున్నారు.

### కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ చేసిన
## ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**ఉప్పల్,మహా:** ఉప్పల్ మున్సిపల్ కార్యాలయం ఉప్పల్ మండలానికి చెందిన 116 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి షాధి ముభారాక్ చెక్కులను పంపిణీ చేశారు,ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన హామీలలో కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ లబ్ధిదారులకు గత ప్రభుత్వం ఇచ్చిన ఒక లక్ష 116 రూపాయలతో పాటు తులం బంగారం కూడా ఇస్తామని హామీ ఇచ్చారు ఇచ్చిన హామీ ప్రకారం లబ్ధిదారులకు తులం బంగారం కూడా ఇస్తే పేదింటి ఆడపిల్లలకు ఎంతో లాభం చేసినట్లు ఉంటుందని ఇకనైనా రాబోయే లబ్ధిదారులకు తులం బంగారం కూడా అందజేయాలని కోరారు ..ఈ కార్యక్రమంలో మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి, నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయి జెన్ శేఖర్, చిలుక నగర్ డివిజన్ కార్పొరేటర్ గీత ప్రవీణ్ ముదిరాజ్, హబ్సిగూడ డివిజన్ కార్పొరేటర్ చేతన హరీష్, రామంతా పూర్ డివిజన్ కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్ రావు ఎమ్మార్వో కార్యాలయ సిబ్బంది టిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### ముఖ్యమంత్రి సహాయనిధి
## పేదలకు వరం: పరమేశ్వర్ రెడ్డి

**ఉప్పల్, మహా:** ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని చిల్కానగర్ న్యూ రామ్ నగర్ ప్రాంతానికి సంబంధించిన ఆరాధ్య అనారోగ్య సమస్యతో నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స చేపించాలని కాంగ్రెస్ పార్టీ చిల్కానగర్ డివిజన్ కాంగ్రెస్ నాయకులు తెలియజేయడంతో అత్యవసర చికిత్స నిమిత్తం సీఎం సహాయ నిధి పథకం కింద LOC ద్వారా ₹1,50,000మంజూరు చేయించి,ఈరోజు LOC పత్రాన్ని వారి కుటుంబ సభ్యులకు ఉప్పల్ నియోజకవర్గం ఇంచార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డి అందజేశారు,ఈ కార్యక్రమం లో సీనియర్ కాంగ్రెస్ నాయకులు తెల్కల మోహన్ రెడ్డి ,శ్రీనివాస్ రెడ్డి,విజయ్ భాస్కర్ గంగ పుత్ర ,రాఘవేందర్ గుప్తా, శ్రీనివాస్ పాల్గొన్నారు.

### స్వచ్ఛత ఈ సేవ ప్రతి
## ఒక్కరి బాధ్యత

### కార్పొరేటర్ బన్నాల



**ఉప్పల్,మహా:** ఉప్పల్ డివిజన్ లోని చిల్కానగర్ లో స్వచ్ఛత ఈ సేవ అవగాహన కార్యక్రమాన్ని లాంచనంగా ప్రారంభించిన కార్పొరేటర్ బన్నాల,చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ సెంట్రల్ యూనివర్సిటీ ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ తార్నాక క్యాంపస్ పిల్లలతో ప్రొఫెసర్ రాజు నాయక్ మరియు రాజ్ కుమార్ ఆధ్వర్యంలో చిల్కానగర్ డివిజన్ ఆదర్శనగర్ లో స్వచ్ఛత ఈ సేవ అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఆదర్శనగర్ లోని పరిసర ప్రాంతాలను జిహెచ్ఎంసి శానిటేషన్ సిబ్బంది మరియు క్యాంపస్ విద్యార్థుల తో కలిసి కార్పొరేటర్ గీతా ప్రవీణ్ AMHO రంజిత్ పాల్గొన్నారు.అనంతరం కార్పొరేటర్ గీత ప్రవీణ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరించి మన పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకునే సోషల్ రెస్పాన్సిబిలిటీ తీసుకోవాలని ఇంటికి వచ్చే చెత్త సేకరణ రిక్షాకి ఇంటిలోని చెత్తని అందజేయాలని పరిసర ప్రాంతాల్లో ఎక్కడ కూడా చెత్త వేయకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు,అనంతరం ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ సెంట్రల్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ హరిబండి లక్ష్మి ,ప్రొఫెసర్ రాజు నాయక్ రాజ్ కుమార్ ని మరియు వారి విద్యార్థులను వారు చేసే సేవా కార్యక్రమాలు అభినందనీయమని అని అన్నారు, అనంతరం ప్రొఫెసర్ రాజు నాయక్ మాట్లాడుతూ చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్ గీతా ప్రవీణ్ మరియు జిహెచ్ఎంసి శానిటేషన్ సిబ్బందితో కలిసి మా యూనివర్సిటీ విద్యార్థులు ఇటువంటి స్వచ్ఛతాహి సేవ కార్యక్రమాన్ని చేసే అవకాశాన్ని కల్పించినందుకు వారికి ధన్యవాదాలు తెలుపారు.

# కుషాయిగూడలో దారుణం

**మహా :** హైదరాబాద్ కుషాయిగూడలో దారుణం చోటు చేసుకుంది. పట్టపగలు నడిరోడ్డుపై అందరూ చూస్తుండగానే కుమారుడు కన్న తండ్రిని హతమార్చాడు. కత్తితో విచక్షణారహితంగా పొడిచి దారుణంగా చంపేశాడు. ఈ ఘటన స్థానికులను ఉలిక్కిపడేలా చేసింది. కుషాయిగూడ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సికింద్రాబాద్ లాలాపేటకు చెందిన ఆరెల్లి మొగిలి, అతని కుమారుడు సాయి కుమార్ ఇద్దరూ కూడా ప్యాకర్స్ అండ్ మూవర్స్‌లో పని చేస్తున్నారు. అయితే తండ్రి మొగిలి మద్యానికి బానిసయ్యాడు. వచ్చే డబ్బులు మొత్తం తాగుడుకు ఖర్చు పెడుతూ ప్రతి రోజూ ఇంట్లో గొడవకు దిగేవాడు. తాగి గొడవ చేయవద్దని కుమారుడు సాయికుమార్ ఎన్నిసార్లు చెప్పినా వినిపించుకోలేదు. దీంతో విసిగిపోయిన కుమారుడు తండ్రి మొగిలిని హతమార్చేందుకు సిద్ధమయ్యాడు. అందుకు సమయం కోసం ఎదురు చూశాడు. ఇవాళ మధ్యాహ్నం లాలాపేట ఇంటి నుంచి మొగిలి ఆర్టీసీ బస్సులో బయలు దేరగా అతడిని సాయి కుమార్ తన బైక్‌పై వెంబడించాడు. ఈసీఐఎల్ బస్ టెర్మినల్ వద్ద తండ్రి మొగిలి బస్సు దిగగా ఆ వెంటనే ఆకస్మాత్తుగా అతడిపై దాడికి తెగబడ్డాడు. తన వెంట తెచ్చుకున్న కత్తితో విచక్షణా రహితంగా పొడిచాడు. తండ్రి మొగిలి తప్పించుకునే ప్రయత్నం చేసినా వెంబడించి వేటాడి దారుణంగా పొడిచి చంపాడు. అందుకు సంబంధించిన దృశ్యాలు అక్కడే ఉన్న సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. మొగిలిని కుమారుడు హత్య చేస్తుంటే.. అక్కడ ఉన్నవారు వేడుక చూశారే తప్ప ఏ ఒక్కరూ కూడా రక్షించే ప్రయత్నం చేయలేదు. కొందరైతే తమ సెల్‌ఫోన్లలో హత్యోదంతాన్ని వీడియోలు తీశారు. సాయి కుమార్ అక్కడి నుంచి వెళ్లిపోయిన తర్వాత తీవ్రంగా గాయపడిన మొగిలిని స్థానికులు ఆసుపత్రికి తరలించారు. హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ అతడు ప్రాణాలు కోల్పోయాడు. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ హాస్పిటల్‌కు తరలించారు. కుటుంబ కలహాలు, ఆస్తి తగాదాల కారణంగానే తండ్రి మొగిలిపై సాయికుమార్ దాడి చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు విచారణను కొనసాగిస్తున్నారు.



## కేసీఆర్ పాలనలో వ్యవస్థలు నాశనం

### రేవంత్ పాలనపై చర్చకు సిద్ధం
### కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

(మొదటిపేజీ తరువాయి)

రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామన్న ప్రకటన ఏమైందని నిలదీశారు. ఇక సీఎం రేవంత్ విసిరిన సవాల్‌పైనా ఇదే వేదికగా కిషన్ రెడ్డి స్పందిస్తూ.. పరిపాలనపై చర్చకు సిద్ధమా? అని రేవంత్‌కు ప్రతి సవాల్ చేశారు. చర్చకు తాము సిద్ధమనేనన్నారు. బూతులు, దాడులతో కాకుండా చర్చ సాఫీగా సాగేలా ప్రభుత్వం చర్య తీసుకోవాలన్నారు. హామీలు ఇవ్వడం, ఆ తర్వాత విస్మరించడం, ప్రజల దృష్టిని మళ్ళించేందుకు కేదంంపై నిందలు వేయడంతోనే రేవంత్ రెడ్డి ప్రాధాన్యం ఇస్తున్నారు తప్ప చిత్తశుద్ధితో ప్రజలకు సేవ చేయాలన్న ఆలోచన ఏ మాత్రం లేదని దుయ్యబట్టారు.

# పరారీలో నిందితులు దొరకని ఆచూకీ

### పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు

**వరంగల్, మహా;** గ్రేటర్ వరంగల్ నగరం తోపాటు ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. పగలు రాత్రి అనే తేడా లేకుండా కొందరు కత్తులతో స్వైర విహారం చేస్తూ ప్రజల్లో భయాందోళనలు రేకెత్తిస్తున్నారు. మద్యం గంజాయి కొన్నిచోట్ల డ్రగ్స్ మత్తులో ప్రయాణ ప్రాంగణాలు రైల్వే స్టేషన్ పరిసరాల్లో వీరంగం సృష్టిస్తున్నారు. చిన్నచిన్న ఘర్షణలు తగదాలకే కత్తులతో పోల్చుకోవడం హత్యలు హత్యాయత్నాల సంస్కృతి వేగంగా విస్తరిస్తోంది. దీంతో పోలీసు నిఘా ఏమైంది అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. సదరు బాధితులు ఫిర్యాదు చేస్తున్న పోలీసులు ప్రత్యేక దృష్టి సారించడం లేదన్న ఆరోపణలు లేకపోలేదు. ఇటీవల వరంగల్ నగరంలో భార్య పల్లె కత్తితో కిరాతకంగా నరికిన భర్త కోట చంద్రశేఖర్ పరారీలో ఉన్నాడు. నిందితుని కోసం మూడు ప్రత్యేక పోలీసు బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టినట్లు మట్టెవాడ ఠాణా సీఐ గోపిరెడ్డి తెలిపారు. కొద్ది రోజులుగా నిందితుడు చంద్రశేఖర్ చరవాణి వాడటం లేదని తెలిసింది. దీంతో నిందితుడి ఆచూకీ కనిపెట్టడం పోలీసులకు క్లిష్టతరంగా మారిందని స్నేహితులు బంధువుల అందించిన సమాచారంతో నగరంలోని ఉరుసు కరీమాబాద్ దేశాయిపేట రంగంపేట తోపాటు పలు పరిసర ప్రాంతాల్లో గాలిస్తున్నారు. మరోవైపు నిందితుడు చంద్రశేఖర్ కు ముందస్తు మేలు కోసం ఆయన స్నేహితులు ప్రయత్నిస్తున్నట్లు తెలియడంతో పోలీసులు గాలింపు మరింత ముమ్మరం చేశారు. భర్త దాడిలో తీవ్రంగా గాయపడిన పల్లవిని కేఎంసీ ఆసుపత్రిలో కోలుకుంటున్న ఆమెను ఏసిపి నందిరాం నాయక్ తో పాటు పలువురు పరామర్శించడం జరిగింది. పల్లవి తండ్రి బాబు తల్లి అనిత ఎంజిఎం లో చికిత్స పొందుతున్నారు.

**వైద్యుడి పై దాడి చేసిన నిందితుడు పరారీ**

ఉరుసుగుట్ట బట్టుపల్లి రోడ్డులో గురువారం రాత్రి యువ వైద్యుడు గాదే సుమంత్ రెడ్డి పై జరిగిన దాడి ఘటనలో నిందితులను పట్టుకునేందుకు వరంగల్ ఏసిపి నందిరాం నాయక్ ఆధ్వర్యంలో క్రైమ్ విభాగం, టాస్క్ ఫోర్స్ తో పాటు ఇతర విభాగాలతో 8 బృందాలుగా ఏర్పడిన పోలీసులు పూర్తిస్థాయిలో గాలింపు చర్యలు చేపట్టారు. వరంగల్ నుంచి కాజీపేట మడికొండ వరకు రోడ్లపై దుకాణ సముదాయాల్లో పెట్రోల్ పంపులు ఏర్పాటు చేసిన అన్ని సీసీ కెమెరాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. హైదరాబాదులో చికిత్స పొందుతున్న సుమంత్ రెడ్డి పరిస్థితి విషమంగానే ఉన్నట్లు తెలిసింది. ఘటన జరిగిన తర్వాత వెంటనే స్పందించాల్సిన పోలీసులు తమ పరిధి కాదని పర్దికి సంబంధించిన పోలీసులు చూసుకుంటారని బాధితులను ఆసుపత్రికి తరలించడంలో జాప్యం చేస్తున్నారు. ఘటన జరిగిన పరిధి విషయంలో మిల్స్ కాలనీ మడికొండ పోలీసులు తమ పరిధి కాదంటే తమది కాదని జాప్యం చేయడంతో బాధితుడు పరిస్థితి విషమంగా మారిందని వైద్యులు వెల్లడించారు. చివరకు బాధితుడు తండ్రి గాదె ఆరోగ్య సుధాకర్ రెడ్డి ఫిర్యాదు మేరకు మిల్స్ కాలనీ పోలీసులు కేసు నమోదు చేశారు.

**రాత్రిళ్ళు తగ్గిన పోలీస్ గస్తీ..**

కొందరు యువకులు నగరంలోని కీలక రహదారులపై ద్విచక్ర వాహనాలపై అర్ధరాత్రి వేళ తిరుగుతూ నానా హంగామా చేస్తున్నారు. పోలీసుల పెట్రోలింగ్ తగ్గడం నగరంలో కొన్నిచోట్ల టిఫిన్ సెంటర్లు పాన్ షాపులు మరీ ముఖ్యంగా మద్యం దుకాణాలు అనధికారికంగా రాత్రి 1:00 వరకు విక్రయాలు కొనసాగిస్తుండడం ద్వారా నేరాలకు కారణాలుగా చెప్పుకోవచ్చు. రాత్రిళ్లు పెట్రోలింగ్ చేస్తున్నామని పోలీసులు చెబుతున్నప్పటికీ పెట్రో కారులో ఒకరే ఉండడం అలాగే క్షేత్రస్థాయిలో నగరంలోని కీలక ప్రాంతాల్లో ఇంటర్ సెక్టార్ వాహనాలు ఉన్న రాత్రి అవి ఎక్కడ కనిపించడం లేదన్న వాదనలు ఉన్నాయి. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో మెట్రో కార్ వాహనాలు ఉన్న చాలావరకు అవి పని చేయడం లేదని తెలిసింది. అర్ధరాత్రి వరకు బిర్యాని సెంటర్లు తెరుచుకొని ఉన్న పోలీసులు చూసి చూడనట్టు వెళుతున్నారని స్థానికులు అంటున్నారు.


EDITORIAL
సంపాదకీయం

# వ్యూహమా.. భయమా?

ఎమ్మెల్సీ ఎన్నికలు తెలంగాణ రాష్ట్ర రాజకీయాలపై ప్రభావం చూపనున్నాయి. బిఆర్ఎస్ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఎందుకు దూరంగా ఉంది? గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మాత్రమే అధికారపార్టీ ఎందుకు పోటీచేస్తోంది? ఎమ్మెల్సీ ఎన్నికలలో ప్రభావం చూపుతున్న అంశాలేంటి? రాజకీయవర్గాల్లో ఈ అంశాలపై ఆసక్తికర చర్చలు సాగుతున్నాయి. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తో పాటు వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, కీలక నేత హరీష్ రావు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాలున్న గ్రాడ్యుయేట్ నియోజకవర్గం లో బీఆర్ఎస్ పోటీకి దూరంగా ఉండడం ఆశ్చర్యకరమే. ఇప్పటికీ ఉత్తర తెలంగాణలో పట్టభద్రులు బిఆర్ఎస్ కు అనుకూలంగా లేరన్న అభిప్రాయంతో బీఆర్ఎస్ ఉందా? ఓవైపు కాంగ్రెస్ గ్రాఫ్ పడిపోయిందని స్వయంగా చెబుతున్న కేసీఆర్ ఈ ఎన్నికల్లో పాల్గొనకపోవడం ద్వారా ఎవరి గ్రాఫ్ బాగుందని చెప్పదలుచుకున్నారు? ఎమ్మెల్సీ ఎన్నికల విధానానికి వ్యతిరేకమైతే ఇటీవల వరంగల్, ఖమ్మం, నల్లగొండ గ్రాడ్యుయేట్ నియోజకవర్గం నుండి బీఆర్ఎస్ పోటీచేసింది. బీఆర్ఎస్ ఓటమి నుండి ఇంకా తేరుకోలేదా? వ్యూహాల్లో తడబడుతుందా? అన్నదానిపై విశ్లేషణలు సాగుతున్నాయి.




**- తాజా రాజకీయ పరిణామాలపై ఎఎన్ఎన్ సిఈవో, జర్నలిస్ట్ కంది రామచంద్రారెడ్డి వీకెండ్ ఎనాలసిస్**




తెలంగాణలో ఓవైపు ఎన్ని కల రాజకీయాలు, మరోవైపు కులగణన ఎత్తులు సాగుతున్నాయి. మూడు ఎమ్మెల్సీ స్థానాలకు మరో నాలుగురోజుల్లో ఎన్నిక జరగనుంది. ప్రచారం తుదిదశకు చేరింది. మూడు ఎన్నికల్లో అత్యంత ఆకర్షించేది కరీంనగర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ. నాలుగు జిల్లాల పరిధిలోని ఈ స్థానం నుండి పోటీలో లేకుండా తప్పుకుంది బీఆర్ఎస్. ఇపుడు పోటీ కాంగ్రెస్, బిజెపి మధ్యే. అధికారపార్టీ అభ్యర్థి పై సహజంగా ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తాయి. ఇది కాంగ్రెస్ పార్టీ సిట్టింగ్ స్థానం. మొత్తం గ్రాడ్యుయేట్ నియోజకవర్గ పరిధిలోని ఓట్లలో 45శాతం కరీంనగర్ జిల్లాలోనే ఉన్నాయి. కాంగ్రెస్ పార్టీ వ్యూహాత్మకంగా ఈ జిల్లాకు చెందిన విద్యావేత్తనే ఎంపిక చేసింది. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయాన్ని నిర్ణయించేది కరీంనగరే. అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి రాష్ట్రంలో 8 స్థానాలు సాధించినా కరీంనగర్ నుండి ఒక్క సీటు కూడా గెలవలేదు. ప్రస్తుతం బిజెపి గ్రాడ్యుయేట్ స్థానానికి నిలిపిన అభ్యర్థి కరీంనగర్ కు చెందిన నేత కాదు. కరీంనగర్ లో ఎక్కువగా కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డి చుట్టే చర్చ జరుగుతున్నది. అది నెగిటివ్ అయినా సరే.. చర్చలో ఉన్న అభ్యర్థి ఆయనే. బిజెపి నుండి సంగారెడ్డి జిల్లాకు చెందిన అంజిరెడ్డి బరిలో ఉన్నాడు. బిజెపి ఏ ఎన్నిక అయినా.. గెలిచేదయినా, ఓడేదైనా పూర్తిస్థాయిలో ప్రచారం నిర్వహిస్తుంది. గల్లీ నుండి ఢిల్లీ దాకా లీడర్లు ప్రచారం చేస్తుంటారు. దీర్ఘకాలిక వ్యూహాలతో బిజెపి ఎపుడూ సాగుతుంది. ప్రస్తుత ఎన్నికల్లోనూ అదే తరహాలో కొత్త ఓటుబ్యాంకు ప్రోదిచేసుకునేందుకు పనిచేస్తోంది. ప్రజలు ఎన్నిక ఎన్నికకూ చాలా తెలివిగా తీర్పును ఇస్తుంటారు. గ్రాడ్యుయేట్లకు తమమీద కోపం తగ్గలేదనే కరీంనగర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిఆర్ఎస్ పోటీచేయలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత నల్లగొండఖమ్మం, వరంగల్ పట్టభద్ర ఎన్నికల్లో పోటీచేసిన బిఆర్ఎస్ ఇపుడు మాత్రం పోటీకి దూరంగా ఉంది. బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ తో పాటు కేటీఆర్, హరీష్ రావు, కవిత నియోజకవర్గాలన్నీ ఈ స్థానం పరిధిలోనే ఉన్నా బిఆర్ఎస్ పోటీచేయకపోవడం గ్రౌండ్ అనుకూలంగా లేదనే. మాజీ ఎంపీ వినోద్ రావు కూడా.. ఇటీవల తెలంగాణభవన్ లో జరిగిన మీడియా సమావేశంలో పోటీకి దూరంగా ఉన్న కారణం వివరించారు. బిజెపి పరిస్థితి భిన్నం. గెలిచినా ఓడినా ఓటుబ్యాంకు విస్తరణ వ్యూహాలతో పోటీచేస్తూనే ఉంటుంది. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలలో ఒకసారి హైదరాబాద్ రంగారెడ్డి, మహబూబ్ నగర్ స్థానం నుండి బిజెపి అభ్యర్థి ఎన్. రామచందర్ రావు టిడిపి పొత్తులో గెలిచారు. ఆ తర్వాత గ్రాడ్యుయేట్ స్థానంలో బిజెపి గెలిచింది లేదు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికను పార్టీపరంగా మొదట లైట్ తీసుకున్నా.. ఎన్నిక సమీపిస్తున్న కొద్దీ కాంగ్రెస్ యాక్టివ్ అయింది. నేరుగా ముఖ్యమంత్రి రంగంలోకి దిగగా, టీపీసీసీ చీఫ్ తో పాటు మంత్రులంతా పనిచేస్తున్నారు. సిట్టింగ్ స్థానం నిలుపుకోవడం కాంగ్రెస్ పార్టీకి చాలా అవసరం. అభ్యర్థులలో అందరికంటే ముందుగా ఆల్ ఫోర్స్ విద్యాసంస్థల అధినేత వి.నరేందర్ రెడ్డి ముందుగా ప్రచారం ప్రారంభించారు. ఓటర్ల చేరికలోనూ ప్రత్యేక వ్యూహంతో వ్యవహరించారు. ఇపుడు పార్టీ శక్తి కూడా తోడవడంతో బలమైన అభ్యర్థిగా పోటీలో ఉన్నారు. రాజకీయాల్లో ఉన్నపుడు, అదీ ఎన్నికల్లో పోటీచేసినపుడు విమర్శలు, ఆరోపణలు ఎదుర్కోకతప్పదు. ఫైనల్ గా ఓటర్లు వివేచనతోనే తీర్పునిస్తారు. భావోద్వేగాలకు, ప్రచార పటాటోపానికి లొంగరు. వాటి ప్రభావం చాలా స్వల్పం. వరంగల్, నల్లగొండ, ఖమ్మం టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రస్తుతం యుటిఎఫ్ నేత, సిట్టింగ్ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి పోటీలో ఉన్నారు. ఇక్కడ ఇతర సంఘాలు కూడా బలంగా ఉన్నాయి.

> **"బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తో పాటు వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, కీలక నేత హరీష్ రావు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాలున్న గ్రాడ్యుయేట్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పోటీకి దూరంగా ఉండడం ఆశ్చర్యకరమే. ఇప్పటికీ ఉత్తర తెలంగాణలో పట్టభద్రులు బిఆర్ఎస్ కు అనుకూలంగా లేరన్న అభిప్రాయంతో బీఆర్ఎస్ ఉందా? ఓవైపు కాంగ్రెస్ గ్రాఫ్ పడిపోయిందని స్వయంగా చెబుతున్న కేసీఆర్ ఈ ఎన్నికల్లో పాల్గొనకపోవడం ద్వారా ఎవరి గ్రాఫ్ బాగుందని చెప్పదలుచుకున్నారు?**

బిజెపి రాష్ట్ర అధ్యక్ష పదవిపై ఏకాభిప్రాయానికి రాలేకపోతుంది. ఎదురులేని ప్రధాని ఉన్నా, కేంద్ర కేబినెట్ విస్తరణ సమయంలోనే ఏడాది క్రితమే హామీనిచ్చినా.. ఇంకా తెలంగాణ రాష్ట్ర పగ్గాల విషయంలో దాటవేత ధోరణి అనుసరించడం వ్యూహమా? భయమా? వారికే తెలియాలి. ఇతర రాష్ట్రాల్లో లేని విధంగా ఓ వైపు కేంద్రమంత్రి, మరోవైపు రాష్ట్ర అధ్యక్ష పదవి రెండూ కిషన్ రెడ్డి ఒక్కరికే అప్పగించడం బిజెపికి తెలంగాణ లో ఇతర నాయకుల పై ఉన్న నమ్మకాన్ని స్పష్టం చేస్తోంది. బిజెపి రాష్ట్ర పదవి ఇచ్చినా, కేంద్రమంత్రి పదవులు, గవర్నర్ పదవులు ఏవి ఇచ్చినా అవి హైదరాబాద్, కరీంనగర్ నేతలను దాటి ఇతరులకు రావు. చరిత్ర దీనిని స్పష్టం చేస్తున్నది. ప్రస్తుత కేంద్ర పదవులు గానీ, రాష్ట్ర పగ్గాలు గానీ వీటికి అద్దం పడుతాయి. కరీంనగర్ లో లేదా, హైదరాబాద్ లో రాజాసింగ్ కాకుండా ఇతరులు ఎమ్మెల్యే సీట్లు గెలిచి ఉంటే బిజెఎల్పీ పదవి కూడా ఇక్కడే ఇచ్చేవారు. ఇదంతా బిజెపి నేతలందరికీ తెలిసిన విషయమే. ఇలాంటి సమస్యలు, హద్దులు పెట్టుకుని బిజెపి విస్తరణపై, అధికారంపై మాట్లాడడం వెనుక లోతుపాతులు ఆ నేతలకే తెలుసు. ఇక కాంగ్రెస్ పార్టీ కూడా పిసిసి చీఫ్ ను నియమించి ఐదుమాసాలైనా ఇంకా కార్యవర్గాన్ని కూడా ఏర్పాటుచేసుకోలేకపోతోంది. స్వయంగా పార్టీ సంస్థాగత వ్యవహారాల ఇన్ ఛార్జి కేసీ వేణుగోపాల్ హైదరాబాద్ వచ్చి మరీ కమిటీలు ఏర్పాటుచేయండి.. క్యాడర్ లో జోష్ నింపండి అంటూ ఆదేశాలు ఇచ్చిన నేతలు ఎప్పటిమాదిరే ఏదో ఒక కారణం చెబుతూ కాలం గడుపుతున్నారు.

> **"కాంగ్రెస్ పార్టీ కూడా పిసిసి చీఫ్ ను నియమించి ఐదుమాసాలైనా ఇంకా కార్యవర్గాన్ని కూడా ఏర్పాటుచేసుకోలేకపోతోంది. స్వయంగా పార్టీ సంస్థాగత వ్యవహారాల ఇన్ ఛార్జి కేసీ వేణుగోపాల్ హైదరాబాద్ వచ్చి మరీ కమిటీలు ఏర్పాటుచేయండి.. క్యాడర్ లో జోష్ నింపండి అంటూ ఆదేశాలు ఇచ్చిన నేతలు ఎప్పటిమాదిరే ఏదో ఒక కారణం చెబుతూ కాలం గడుపుతున్నారు.**

కేసీఆర్ ఏడుమాసాల తర్వాత తెలంగాణభవన్ కు వచ్చి మళ్ళీ పాత లెక్కలు మాట్లాడుతున్నారు. కేసీఆర్ ఎపుడు బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు, నేతల మీటింగ్ లు పెట్టినా అధికారం గురించి, సర్వేలు, గ్రాఫ్ ల గురించే మాట్లాడుతారు. ఇది అందరికీ తెలిసిందే. ఈసారి కూడా మళ్ళీ అధికారం మనదే. కాంగ్రెస్ గ్రాఫ్ పడిపోయిందంటూ మళ్ళీ చెప్పారు. అయితే గ్రాఫ్ బాగున్న పార్టీ తాము ప్రాతినిధ్యం వహించే నియోజకవర్గాలు ఉన్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీచేయడం లేదంటే బాగుందో.. బాగాలేదో వారే చెప్పాలి. బిసి కులగణనతో దేశంలో ఫస్ట్ తామేనని చెబుతున్న కాంగ్రెస్ పార్టీ దీనిని జాతీయ స్థాయి చర్చకు తీసుకువెళ్ళాలని డిసైడైంది. అయితే బిసి కులగణన, రిజర్వేషన్లకు చట్టబద్దత రావడం అంత తేలికైన విషయం కాదు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఒక్కో పార్టీ ఒక్కో స్థానం గెలిస్తే రాజకీయాలు ఎప్పటిలాగే ఉంటాయి. అన్ని స్థానాలు బిజెపి చెబుతున్నట్లుగా లభిస్తే రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెరుగుతుంది.

> **"రాజకీయాల్లో ఉన్నపుడు, అదీ ఎన్నికల్లో పోటీచేసినపుడు విమర్శలు, ఆరోపణలు ఎదుర్కోకతప్పదు. ఫైనల్ గా ఓటర్లు వివేచనతోనే తీర్పునిస్తారు. భావోద్వేగాలకు, ప్రచార పటాటోపానికి లొంగరు. వాటి ప్రభావం చాలా స్వల్పం.**

> **"కేసీఆర్ ఎపుడు బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు, నేతల మీటింగ్ లు పెట్టినా అధికారం గురించి, సర్వేలు, గ్రాఫ్ ల గురించే మాట్లాడుతారు. ఇది అందరికీ తెలిసిందే. ఈసారి కూడా మళ్ళీ అధికారం మనదే. కాంగ్రెస్ గ్రాఫ్ పడిపోయిందంటూ మళ్ళీ చెప్పారు. అయితే గ్రాఫ్ బాగున్న పార్టీ తాము ప్రాతినిధ్యం వహించే నియోజకవర్గాలు ఉన్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీచేయడం లేదంటే బాగుందో.. బాగాలేదో వారే చెప్పాలి.**

> **"బిజెపి రాష్ట్ర పదవి ఇచ్చినా, కేంద్రమంత్రి పదవులు, గవర్నర్ పదవులు ఏవి ఇచ్చినా అవి హైదరాబాద్, కరీంనగర్ నేతలను దాటి ఇతరులకు రావు. చరిత్ర దీనిని స్పష్టం చేస్తున్నది. ప్రస్తుత కేంద్ర పదవులు గానీ, రాష్ట్ర పగ్గాలు గానీ వీటికి అద్దం పడుతాయి. కరీంనగర్ లో లేదా, హైదరాబాద్ లో రాజాసింగ్ కాకుండా ఇతరులు ఎమ్మెల్యే సీట్లు గెలిచి ఉంటే బిజెఎల్పీ పదవి కూడా ఇక్కడే ఇచ్చేవారు. ఇదంతా బిజెపి నేతలందరికీ తెలిసిన విషయమే.**

# మెట్రో @ 24

## స్టేషన్లు ప్రకటించిన మెట్రోరైల్ యాజమాన్యం

## నాగోల్ టు ఎయిర్ పోర్ట్ .. ఫుల్ కనెక్టివిటీ

**మహా:** మెట్రో ఇక హాయ్ హాయ్ అంటూ హైదరాబాద్ వాసులకు మరింత సౌకర్యంగా మారబోతోంది. నాగోల్ టు ఎయిర్ పోర్ట్ మొత్తం 24 స్టేషన్లను ధనాధన్ ప్రకటించేసింది. ఇవి అంతే వేగంగా పూర్తయితే హైదరాబాద్ లో జర్నీ మరింత హాయిగా ఉంటుంది. ట్రాఫిక్ కష్టాలు తీరి మెట్రో వరంగా మారుతుంది. హైదరాబాద్ మహానగరంలో మెట్రోరైలును విస్తరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించిన నేపథ్యంలో మెట్రో యాజయాన్యం దీనిపై అధ్యయనం చేసి కొత్త స్టేషన్లు ఫైనల్ చేసింది. మొదటి దశలో 69కిలోమీటర్ల మార్గంలో చేపట్టిన ప్రభుత్వం రెండో దశలో 161.4కిలోమీటర్ల మార్గంలో చేపట్టాలని నిర్ణయించింది. రెండో దశలో నాగోల్ నుంచి రాజీవ్ గాంధీ అంతర్జాతీయ ఎయిర్ పోర్ట్ వరకు 36.8కిలోమీటర్ల మార్గంలో 24స్టేషన్లను గుర్తించింది. ఈ స్టేషన్ల వివరాలను హైదరాబాద్ మెట్రోరైలు యాజమాన్యం ఎక్స్ ద్వారా శనివారం తెలిపింది. నగరానికి నలువైపుల మెట్రో రైలు మార్గం విస్తరించనుంది. మొదటి దశలో 69కిలోమీటర్ల మెట్రోరైలు ప్రాజెక్టు విజయవంతంగా నడుస్తున్న విషయం తెలిసిందే. రెండో దశలో ఎయిర్ పోర్ట్ వరకు విస్తరణే లక్ష్యంగా 76.4కిలోమీటర్ల మార్గంలో నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. డీపీఆర్ లను కూడా కేంద్రానికి పంపించారు. ఇక ఫోర్త్ సిటీ 40కిలోమీటర్లు, నార్త్ సిటీ 45కిలోమీటర్ల మార్గంలో మెట్రోరైలును విస్తరించాలని నిర్ణయించారు. మొత్తం 230.4కిలోమీటర్ల మార్గంతో ఢిల్లీ తర్వాత హైదరాబాద్ మెట్రోరైలు రెండో స్థానంలో నిలవనుంది.

### నగరానికి నలువైపులా..

నాగోల్ నుంచి ఎయిర్ పోర్టు వరకు మెట్రోరైలు మార్గంలో 24 స్టేషన్లను గుర్తించారు. వాటికి సంబంధించిన వివరాలను ఎక్స్ ద్వారా వెల్లడించారు. నాగోల్, నాగోల్ ఎక్స్ రోడ్డు, అల్కాపురి, కామినేని హస్పిటల్, ఎల్బీనగర్(ఎయిర్ పోర్ట్), బైరమాల్ గుడ, మైత్రీనగర్, కర్మాన్ ఘాట్, చంపాపేట్, ఓవైసీ హస్పిటల్, డీఆర్డీఓ కంచాన్ బాగ్, బాలాపూర్ రోడ్డు, చాంద్రాయన్ గుట్ట, బండ్లగుడ రోడ్, మైలార్ దేవ్ పల్లి, కాటేదాన్, ఆరాంఘర్, న్యూ హైకోర్టు, గగన్ పహాడ్, శాతంరాయి, సిద్దాంతి, శంషాబాద్, కార్గో, రాజీవ్ గాంధీ అంతర్జాతీయ ఎయిర్ పోర్ట్ ఉన్నాయి.

### తొలిదశకు అనుసంధానం

మొదటి దశ కారిడార్ 1లోని ఎల్బీనగర్మియాపూర్ మెట్రో మార్గంతో (29 కి.మీ) అనుసంధానం చేస్తూ మియాపూర్ నుంచి పటాన్చెరు వరకు 13.4 కి.మీ దూరం, ఎల్బీనగర్ నుంచి హయత్నగర్ వరకు 7.1 కి.మీ మేర నిర్మాణం చేపట్టనున్నారు.దీంతో ఈ కారిడార్ 49.5కిలోమీటర్లకు పెరగనుంది. కారిడార్2లో జేబీఎస్ నుంచి ఎంజీబీఎస్ వరకు 11 కి.మీ ఉన్న ఈ మెట్రో మార్గానికి సైతం రెండు వైపులా కొత్తగా అనుసంధానం చేస్తూ మెట్రో మార్గాలను విస్తరించనున్నారు. ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5కి.మీ, జేబీఎస్ నుంచి శామీర్పేట వరకు 22కి.మీ మేర మొత్తం 40.5కి.మీ కానుంది.

### రాయదుర్గం టు ఎయిర్ పోర్టు వయా నాగోల్ 56.4కి.మీ

కారిడార్3లో నాగోల్రాయదుర్గం మెట్రో మార్గం (29 కి.మీ)లో నాగోల్ నుంచి ఎల్బీనగర్, చాంద్రాయణగుట్ట, ఆరాంఘర్ మీదుగా శంషాబాద్ విమానాశ్రయం వరకు 36.4 కి.మీ మేర మెట్రో మార్గాన్ని నిర్మించనున్నారు.దీంతో మార్గం 56.4కి.మీలకు పెరగనుంది. రాయదుర్గం మెట్రోస్టేషన్ నుంచి కోకాపేట నియోపోలీస్ లేఅవుట్ వరకు 11.6 కి.మీ మేర నిర్మిస్తారు. ఇదే కారిడార్లో ప్యారడైజ్ మెట్రోస్టేషన్ నుంచి బోయిన్పల్లి, సుచిత్ర మీదుగా నాగ్పూర్ జాతీయ రహదారి వెంబడి మేడ్చల్ వరకు మరో 23 కి.మీ మేర కొత్తగా మెట్రో మార్గాన్ని నిర్మించనున్నారు.

### ఫోర్త్ సిటీ రూటు

శంషాబాద్ ఎయిర్పోర్టు మెట్రో స్టేషన్ నుంచి ఫోర్త్ సిటీ వరకు నిర్మించే మెట్రో మార్గాన్ని ఔటర్ రింగు రోడ్డు మీదుగా తుక్కుగూడ, కొంగరకలాన్, రంగారెడ్డి కలెక్టరేట్ నుంచి మీర్ఖాన్పేట వద్ద ప్రతిపాదించిన ఫోర్త్సిటీ వరకు 40 కి.మీ మేర కొత్తగా మెట్రో మార్గాన్ని నిర్మించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించారు. ఇందుకు సంబంధించి ప్రణాళికలపై యాజమాన్యానికి ఆదేశాలిచ్చారు.



## మెట్రో రూట్స్

కారిడార్-1 (ఎల్బీనగర్-మియాపూర్) - 29 కి.మీ
కారిడార్-2 (జేబీఎస్-ఎంజీబీఎస్) - 11 కి.మీ
కారిడార్-3 (నాగోల్ - రాయదుర్గం) - 29 కి.మీ
ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట - 7.5 కి.మీ
నాగోల్-ఎల్బీనగర్-చాంద్రాయణగుట్ట- ఆరాంఘర్-శంషాబాద్ - 36.4 కి.మీ
రాయదుర్గం - కోకాపేట నియోపోలిస్ - 11.6 కి.మీ
మియాపూర్ - బీహెచ్ఈఎల్- పటాన్చెరు - 13.4 కి.మీ
ఎల్బీనగర్ - వనస్థలిపురం- హయత్నగర్ - 7.1 కి.మీ
శంషాబాద్ ఎయిర్పోర్టు - ఓఆర్ఆర్ మీదుగా కొంగరకలాన్- ఫోర్త్ సిటీ - 40 కి.మీ
ప్యారడైజ్- మేడ్చల్ - 23 కి.మీ.. జేబీఎస్ - శామీర్పేట - 22 కి.మీ

రచనలకు ఆహ్వానం
ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.
మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp-
7436939999

# నేడే గురుకుల పరీక్ష



**హుజూర్ నగర్, మహా:** నేడే గురుకుల పాఠశాల పరీక్ష నిర్వహించడం జరుగుతుందని ప్రిన్సిపాల్ దున్న వెంకటేశ్వర్లు తెలిపారు. 202425 విద్యా సంవత్సరానికి ఐదవ తరగతిలో ప్రవేశాలకు ఈనెల 23న స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల మరియు కళాశాల హుజూర్నగర్,మఠంపల్లి లో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ దున్న వెంకటేశ్వర్లు, చింతా విజయ్ లక్ష్మీ శనివారం ఒక ప్రకటన లో తెలిపారు.2 పాఠశాలలకు దాదాపు 1019 మంది విద్యార్థులను పరీక్షా కేంద్రానికి కేటాయించారని ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరీక్ష ఉంటుందని, విద్యార్థులను గంట ముందుగా పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తామని తెలియజేశారు. పరీక్ష రాసే విద్యార్థులు ప్యాడ్, బాల్ పాయింట్ పెన్, హాల్ టికెట్ తప్పనిసరిగా తీసుకొని రావాలన్నారు. ఓఎంఆర్ పద్ధతిలో పరీక్ష ఉంటుందని, పరీక్ష కేంద్రంలో అన్ని సంసిద్ధం చేశామని ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు వివరించారు.

# బీసీల హక్కుల కోసం ఉద్యమ సమయం ఆసన్నం

## మున్నూరుకాపుల ఐక్యతపై ప్రత్యేక పిలుపు
## రాజ్యాధికారంలో బీసీలకు న్యాయమైన వాటా కట్టుబాటు
## ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ఉత్తేజిత ప్రసంగం

**హైదరాబాద్ మహా:** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు అన్యాయం చేస్తున్నాయని రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర తీవ్రంగా విమర్శించారు. బీసీలు తమ హక్కుల సాధన కోసం ఐక్యంగా ముందుకు రావాలని, న్యాయమైన వాటా కోసం సమరశీల పోరాటానికి సిద్ధమవ్వాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్ మియాపూర్‌లో జరిగిన మున్నూరుకాపు, కాపు ప్రతినిధుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ఈ విషయాలను స్పష్టంగా తెలియజేశారు.

**బీసీల హక్కుల కోసం ఉద్యమ సమయం ఆసన్నం**

ఎంపీ వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ, స్వాతంత్రం వచ్చిన 80 ఏళ్ల తర్వాత కూడా బీసీలకు కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖ లేకపోవడం, చట్టసభల్లో తగిన రిజర్వేషన్లు లేకపోవడం విచారకరమని అన్నారు. దేశ జనాభాలో 50% పైగా ఉన్న బీసీలకు అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

**ఎస్ కే ఎస్ సర్వే ప్రాముఖ్యత – బోగస్ సర్వే వ్యతిరేకంగా పోరాటం**

2014లో సీఎం కేసీఆర్ నేతృత్వంలో నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వే అత్యంత ప్రామాణికమైనదని, దేశవ్యాప్తంగా ఆదర్శంగా నిలిచిందని రవిచంద్ర గుర్తుచేశారు. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల చేపట్టిన సర్వే పూర్తిగా అవాస్తవాలతో నిండి ఉందని, తెలంగాణ జనాభా 4.3 కోట్లుగా ఉండాల్సి ఉండగా, 3.7 కోట్లుగా చూపడం క్షమించరాని తప్పని తెలిపారు.

**రాజ్యాధికారంలో బీసీలకు న్యాయమైన వాటా కట్టుబాటు**



బీసీలు తమ హక్కుల కోసం గట్టిగా నిలబడాలని, ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని ఎంపీ రవిచంద్ర పిలుపునిచ్చారు. చట్టసభల్లో 33% రిజర్వేషన్లు, స్థానిక సంస్థల్లో 42% రిజర్వేషన్లు, కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మార్చి చివరి వారంలో లేదా ఏప్రిల్ నెలలో మున్నూరుకాపుల భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తామని వెల్లడించారు.

## రెంటాల సోమయ్య మృతి బాధాకరం

### మాల మహానాడు జాతీయ అధ్యక్షులు చెన్నయ్య



**హుజూర్ నగర్, మహా:** హుజూర్ నగర్ పట్టణ పరిధిలోని గోవిందాపురంలో ఇటీవల గుండెపోటుతో మరణించిన రెంటాల సోమయ్య కుటుంబాన్ని మాల మహానాడు జాతీయ అధ్యక్షులు జి.చెన్నయ్య పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెంటాల సోమయ్య మరణం ఆ కుటుంబానికి తీరని లోటు అని ఆయన ఆశయాలు మరువలేనివి అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ హైకోర్టు పి.పి పల్లె నాగేశ్వరరావు, సూర్యాపేట డిప్యూటీ డిఎంహెచ్ఓ చంద్రశేఖర్ ,డాక్టర్ కందుల గోవింద్, మాల మహానాడు నియోజకవర్గ కన్వీనర్ దగ్గుపాటి బాబురావు,ఇట్టిమల్ల బెంజిమెన్ ఇట్టిమల్ల శ్రీను రాంబాబు, వినోద్, విమన్ పాల్గొన్నారు.

## జగదీశ్వర్ రెడ్డి తెలంగాణ
# మీ అయ్య జాగీరా..?

■ చంద్రబాబును అడ్డుకునే హక్కు మీకు ఎక్కడిది..-తెలుగుదేశం నేత మండవ వెంకటేశ్వర్లు గౌడ్



**హుజూర్ నగర్, మహా:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబును తెలంగాణ నుంచి తన్ని తరిమేసామని చంద్రబాబు తెలంగాణ ద్రోహి అని వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన సూర్యాపేట ఎమ్మెల్యే గుంతకండ్ల జగదీశ్వర్ రెడ్డి పై హుజూర్ నగర్ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నేత మండవ వెంకటేశ్వర్లు గౌడ్ తీవ్రంగా మండిపడ్డారు. శనివారం హుజూర్ నగర్ పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగదీశ్వర్ రెడ్డి తెలంగాణ నీ అయ్య జాగీరా అంటూ ప్రశ్నించారు. తెలుగుదేశం పార్టీ తెలంగాణ లోని పుట్టిందని , ఎన్టీఆర్, చంద్రబాబు హయాంలోనే తెలంగాణ అభివృద్ధి చెందిన విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. హైదరాబాద్ మహా నగరాన్ని అభివృద్ధి తెలంగాణ తలసరి ఆదాయం పెరగటానికి మిగులు బడ్జెట్ ఉండటానికి చంద్రబాబు నాయుడు కారణమనే విషయాన్ని మరిచిపోతే ఎలా అని ప్రశ్నించారు. తెలంగాణ ఏర్పాటుకు తెలుగుదేశం పార్టీ లేఖ ఇచ్చిన విషయం వాస్తవం కాదా అని అన్నారు. గత అసెంబ్లీ , పార్లమెంట్ ఎన్నికల్లో ఘోర ఓటమి చూసిన తర్వాత మీ నాయకుడు కెసిఆర్ తెలంగాణ ప్రజలకు మొహం చూపించలేక ఫామ్ హౌస్ కే పరిమితమయ్యాడని విమర్శించారు. ఫామ్ హౌస్ లో ఉన్న కేసీఆర్ మెప్పు కోసం జగదీశ్వర్ రెడ్డి చంద్రబాబుపై నోరు పారేసుకుంటున్నారని విమర్శించారు. ఎల్లాకాలం సెంటిమెంట్ పనిచేయదు అనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. తెలంగాణలో తెలుగుదేశం పార్టీ బలపడుతున్న విషయాన్ని గ్రహించి, తెలుగుదేశం బలపడితే బిఆర్ఎస్ ఉనికి కోల్పోతుందనే అసహనంతో చంద్రబాబు నాయుడును విమర్శిస్తున్నారన్నారు. తెలంగాణలో పాలక పక్షమైన కాంగ్రెస్ పార్టీ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నించకుండా తెలుగుదేశం అధినేత అయిన చంద్రబాబు నాయుడు పై విమర్శలు చేయటం ఏమిటని ప్రశ్నించారు. చంద్రబాబు నాయుడు పై మరోసారి తీవ్రమైన వ్యాఖ్యలు చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిఎన్టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీతల రోశపతి , టౌన్ పార్టీ నాయకులు తమ్మిశెట్టి రాములు , బీసీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చల్లా వంశీ, గరిడేపల్లి మండల పార్టీ అధ్యక్షులు కీసరి నాగయ్య ముదిరాజ్ , మఠంపల్లి మండల పార్టీ అధ్యక్షులు బానోతు నాగేశ్వరావు నాయక్ , మేళ్లచెరువు మండల పార్టీ నాయకులు బుక్య బాలాజీ నాయక్ , రౌతు కొండలు , నల్లగొండ పార్లమెంటు నాయకులు పోలగాని సురేష్ గౌడ్, గరిడేపల్లి మండల పార్టీ ప్రధాన కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు గౌడ్ , టిఎన్టియుసి పట్టణ నాయకులు గుండెబోయిన వెంకన్న యాదవ్ , యల్లవుల వెంకన్న యాదవ్ తదితర నాయకులు పాల్గొన్నారు.



## అదనపు కలెక్టర్ కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి సీతక్క

ములుగు, మహా : ములుగు జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) చీమలపాటి మహేందర్ జీ తల్లి రాదాభాయి ఇటీవల అనారోగ్యంతో మరణించగా శనివారం రాష్ట్రపంచాయతీరాజ్, గ్రామీణాభి వృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖా మంత్రి దనసరి అనసూయ (సీతక్క) పరామర్శించారు. జనగామ జిల్లా రఘునాథ్ పల్లిలోని మహేందర్ జీ ఇంటికి వెళ్లి రాధాభాయి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. మృతికి గల కారణాలను తెలుసుకున్న మంత్రి సీతక్క అదనపు కలెక్టర్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. మంత్రి వెంట స్థానిక కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

## హెచ్ఐవీ ఎయిడ్స్ పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలి

- ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఈసం నారాయణ
- ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో అవగాహన




**ములుగు, మహా :** హెచ్ఐవీ, ఎయిడ్స్ మహమ్మారి చాపకింద నీరులా విస్తరిస్తోందని, ప్రతీ విద్యార్థి అవగాహన కలిగి ఉండాలని కాకతీయ యూనివర్సిటీ ఎన్ఎస్ కోఆర్డినేటర్ ఈసం నారాయణ సూచించారు. శనివారం ములుగులోని మహర్షి డిగ్రీ, పీజీ కళాశాలలో కరస్పాండెంట్ తుమ్మ పిచ్చిరెడ్డి అధ్యక్షతన జరిగిన రెడ్ రిబ్బన్ క్లబ్ అవగాహన కార్యక్రమంలో ఈసం నారాయణ తోపాటు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జగదీశ్వర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ.. నివారణ మాత్రమే ఉన్నటువంటి ఎయిడ్స్ ద్వారా జీవితాలు విచ్ఛిన్నమవుతాయని, కుటుంబాలు నాశనమవుతాయని పేర్కొన్నారు. ముఖ్యంగా యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా మంచి జీవనాన్ని గడపాలని, విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత కొలువులు సాధించాలన్నారు. ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ జగదీశ్వర్ మాట్లాడుతూ జిల్లాలో 700లమంది ఎయిడ్స్ బాధితులు ఉన్నారని, అందులో కేవలం 25వాతం మంది మాత్రమే మందులు వాడుతున్నారని పేర్కొన్నారు. భయంతో, మొహమాటంతో ఎవరికీ తెలియకుండా బహిర్గతంగా తిరుగుతున్నారన్నారు. ప్రాజెక్టు ఆఫీసర్ జ్యోతి మాట్లాడుతూ ఎయిడ్స్ పట్ల విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఎయిడ్స్ రావడానికి గల కారణాలు, నివారించడానికి మార్గాలను సవివరంగా వివరించారు. యువత డ్రగ్స్ కు అలవాటు కాకుండా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ జిల్లా కన్వీనర్ ప్రసన్న కుమార్, కళాశాల కరస్పాండెంట్ తుమ్మ పిచ్చిరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## విద్యార్థులు కుటుంబ విలువలు తెలుసుకోవాలి

**హుజూర్ నగర్, మహా:** విద్యార్థులకు చిన్నతనం నుంచే కుటుంబ విలువలను తల్లిదండ్రులు తెలియజేయాలని ప్రిన్సిపాల్ పోసాని వెంకటరమణారావు అన్నారు. పట్టణంలోని శ్రీ చైతన్య టెక్నో స్కూల్లో శనివారం నిర్వహించిన ఫ్యామిలీ బ్లూమ్ కార్యక్రమం లో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు తల్లిదండ్రుల కాళ్లు కడిగి వాళ్ళ ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం తల్లిదండ్రులను శాలువాతో సత్కరించి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు అందర్నీ అలరించాయి. తల్లిదండ్రులు మాట్లాడుతూ విద్యార్థులకు కుటుంబ విలువలను తెలిసే విధంగా కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని చదువుతోపాటు మన సంస్కృతి సాంప్రదాయాలను తెలియజేస్తున్న పాఠశాల యజమానియానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డీన్ ప్రేమ్ సాగర్, ఉపాధ్యాయులు ప్రియాంక,నాగేశ్వరరావు, సబీనా,రమాదేవి, సాజిదా, తేజస్వి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు, బాలికలకు షీటీమ్స్ తో భరోసా

■ విద్యాసంస్థలు, రద్దీ ప్రాంతాల్లో నిరంతర నిఘా..షీ టీం ఎస్సై మౌనిక




**ములుగు, మహా :** మహిళలు, బాలికలు, విద్యార్థినిలకు షీటీమ్తో భద్రత, భరోసా కలుగు తుందని, ఎవరైన వేధింపులకు గురైనట్లైతే వెంటనే జిల్లా షీ టీమ్ నెంబర్ 8712670115, 100కు ఫిర్యాదు చేయాలని షీటీమ్ ఎస్సై మౌనిక అన్నారు. నిందితులను గుర్తించి చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్పీ శబరీష్, సీసీఎస్ ఇన్స్పెక్టర్ బి.రమేష్ ఆదేశాల మేరకు ములుగులోని మండల సమాఖ్య కార్యాలయంలో మహిళలకు షీటీమ్స్ పనితీరుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మౌనిక మాట్లాడుతూ.. జిల్లాలోని షీ టీమ్ బృందాలు ప్రభుత్వ కళాశాలు, పాఠశాలలు, కేజీబీవీ, మోడల్ స్కూళ్లల విద్యార్థినులకు ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, పోక్సో, షీ టీమ్స్, యాంటీ హ్యూమెన్ ట్రాఫికింగ్ తదితర అంశాలపై నిత్యం అవగాహన కల్పిస్తున్నామన్నారు. ధైర్యంగా ఉండాలని, ఎలాంటి ఆపద సమయంలోనైనా తాము ఉన్నామనేది గుర్తుంచుకోవాలన్నారు. ఎలాంటి వేధింపులకు గురైనా మహిళలు షీటీమ్ కు ఫిర్యాదు చేయాలన్నారు. ఫిర్యాదు దారుల వివరాలు గోప్యంగా ఉంచబడతాయని, అత్యవసర పరిస్థితుల్లో 100కు ఫోన్ చేసి తక్షణ పోలీస్ సహాయం పొందాలని సూచించారు. విద్యార్థినిలకు కళాశాల విద్య చాలా ముఖ్యమైనదని, ఎవరు కూడా మీ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోకుండా చదువుల్లో రాణించాలన్నారు. ఈ సందర్భంగా మానవ అక్రమ రవాణా, ఫోక్సో చట్టం, బాల్య వివాహాల నియంత్రణ, ఈవ్టీజింగ్, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ తదితర అంశాలపై వివరించారు. అదేవిధంగా మహిళలు, బాలికలు సెల్ఫ్ డిఫెన్స్ పై అవగాహన పెంచుకోవా లన్నారు. ఈ కార్యక్రమలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## వయోవృద్ధుల నుండి వినతులు స్వీకరించిన కలెక్టర్




**వరంగల్, మహా :** దివ్యాంగులకు ప్రతినెల నాల్గవ శనివారం వరంగల్ కలెక్టరేట్ కార్యాలయంలో ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద వెల్లడించారు. శనివారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో ఆదనవు కలెక్టర్ సంధ్యారాణి తో కలసి దివ్యాంగులు, వయోవృద్ధుల నుండి వినతులు స్వీకరించి సంభందిత అధికారులకు మానవతా దృక్పథంతో త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజావాణిలో దివ్యాంగులు,వయోవృద్ధుల నుండి వినతులు స్వీకరించిన (13) దరకాస్తుల్లో. డీఎస్పిడిఓ కు సంబందించి 7, జిల్లా సంక్షేమ శాఖ 5, జిల్లా పరిషత్తు కు సంబంధించిన 01 ఉన్నాయి. ఈ గ్రీవెన్స్ లో డిఆర్డీఓ కౌసల్యాదేవి, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది, దివ్యాంగులు, వయోవృద్ధుల తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ పై యువతకు అవగాహన సదస్సు



**ఇబ్రహీంపట్నం, మహా:** గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడి యువత జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఏసిపి అవగాహన సదస్సు నిర్వహించారు. ఇబ్రహీంపట్నం మండలం, పోచారం గ్రామంలో యువత డ్రగ్స్, గంజాయి, ఆన్ లైన్ బెట్టింగ్, గేమింగ్, ఆన్ లైన్ లోన్ వంటి వాటికి అలవాటు పడి బానిసలుగా మారి తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవి రాజు, సిఐ జగదీష్ తో కలిసి అవగాహనా సదస్సు నిర్వహించడం జరిగింది. ఏసీపీ మాట్లాడుతూ... యువత చెడు వ్యసనాలకు అలవాటుపడి దొంగతనాలకు పాల్పడుతున్నారని అన్నారు. ముఖ్యంగా పోచార గ్రామంలో కొంతమంది యువకులు గంజాయి విక్రయాలు చేపడుతున్నారని సమాచారం ఉందని అన్నారు, ఇలాంటి వారిని వాళ్ళ తల్లిదండ్రులు గమనించి వారిని మార్చుకునే బాధ్యత తీసుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాలలో యువకులు గంజాయి బారినపడి తమ జీవితాలను నాశనం చేసుకోవడం బాధాకరమైన విషయమని తెలిపారు. ఇటీవల కాలంలో తరచు చైన్ స్నాచింగ్ లు, మర్డర్లు వంటి కేసులకు లోనవుతున్నారు. పిల్లలు సెల్ ఫోన్లకు అలవాటుపడి చెడు మార్గాల వైపు మారే ప్రమాదం ఉందని, తల్లిదండ్రులు జాగ్రత్తపడి పిల్లలను సెల్ ఫోన్లకు దూరంగా ఉంచాలని కోరారు. అక్కడే ఉన్న కొంతమంది పిల్లలను ఏసీపీ రాజు పిలిచి మీరు సెల్ ఫోన్లలో ఎలాంటి గేమ్స్ ఆడుతున్నారని అడగగా పలు రీల్స్, గేమ్స్ ఆడుతున్నామని సమాధానం ఇచ్చారు. గ్రామాలలోని యువకులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని ఇలాంటి వాటికి ఎవరైనా బానిసలు అయితే, వారి వివరాలను తెలియజేయాలని గ్రామంలోని పెద్దలను కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రామకృష్ణ, ఏఎంసీ చైర్మన్ గుర్నాథ్ రెడ్డి, వైస్ చైర్మన్ కర్ణాకర్, దేవాదాయ చైర్మన్ నరేష్, పోచారం నాయకులు వెంకటేష్, చిన్న, డైరెక్టర్ రామారావు, గ్రామ ప్రజలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.



## భార్య మందలించిందని
# భర్త ఆత్మహత్య..

**వెంకటాపురం,మహా:** మద్యం తాగి వస్తున్న భర్తను భార్య మందలించడంతో పురుగుల మందు త్రాగి భర్త ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన ఘటన నూగూరు వెంకటాపురం మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం..నూగురు వెంకటాపురం మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన చింతం శ్రీకాంత్ (24) అనే వ్యక్తి మేస్త్రీ పని చేస్తుండేవాడు. గత మూడు రోజులుగా పనికి వెళ్లకుండా మద్యం సేవిస్తూ ఇంటికి వస్తుండడంతో భార్య రమ్య మందలించింది. దీంతో మనస్థాపానికి గురైన భర్త పురుగుల మందు తాగాడు. ఈ విషయాన్ని గమనించిన స్నేహితులు కుటుంబ సభ్యులకు తెలియపరచి అక్కడి నుంచి వైద్యం కోసం వెంకటాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగ పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఏంజీఏం ఆసుపత్రికి తరలించగా శనివారం రోజున ఉదయం శ్రీకాంత్ మృతి చెందాడు. కాగా ఈ ఘటనపై మృతుని తల్లి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## సమస్యలను పరిష్కరించాలని
# ఆర్డీవో కు వినతి

**తొర్రూరు, మహా:** తొర్రూరు ప్రాంత సమస్యలను పరిష్కరించాలని ఆర్డీవో గణేష్‌కు వామపక్ష పార్టీల నేతలు వినతిపత్రం సమర్పించారు. శనివారం తొర్రూర్ లో ఆర్డీవో ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించారు.తొర్రూరు ప్రాంత సమస్యల పై వామపక్ష పార్టీల నాయకులు ధర్నాను ఉద్దేశించి సిపిఐ రాష్ట్ర నాయకులు తమ్మెర విశ్వేశ్వరరావు, సిపిఐ ఎంఎల్ మాస్ జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి, సిపిఎం జిల్లా నాయకులు బొల్లం అశోక్ లు మాట్లాడుతూ...తొర్రూరులో మంజూరైన 100 పడకల ఆసుపత్రి నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలని, ఆస్పత్రి నిర్మాణాన్ని ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా పట్టణ కేంద్రంలో నిర్మించాలని, తొర్రూరు పట్టణంలో ప్రైవేటు భూమిని కొనటానికి నిధుల కొరత ఉంటే వామపక్ష పార్టీలు జోల పట్టుకుని నిధులు వసూలు చేయడానికి కూడా సిద్ధంగా ఉన్నామన్నారు.దీనిలో ప్రజాప్రతినిధులు కూడా పాల్గొనవచ్చని ఆహ్వానించారు. తొర్రూరు ప్రధాన రహదారిపై డ్రైనేజీని నిర్మాణాన్ని పూర్తి చేస్తూ కరెంటు పోల్స్ తొలగించాలని రోడ్డు నుండి డ్రైనేజీ వరకు సిసి రోడ్డు నిర్మించాలన్నారు. మినీ ట్యాంక్ బండ్ పనులు జరగకపోవటంతో వాటి నిర్మాణానికి వచ్చిన నిధులు మురిగిపోతున్న, ప్రభుత్వం స్పందించకపోవడం సరి కాదన్నారు. అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని చేపట్టి ఇల్లు లేని వారికి నివాసాన్ని కల్పించాలని అన్నారు. డివిజన్ కేంద్రమైన తొర్రూరులో వివిధ ప్రభుత్వ కార్యాలయాలు ముఖ్యంగా ఎస్ టి ఓ, ఫైర్ స్టేషన్,ఇరిగేషన్ ఆఫీస్ తో పాటు మినీ స్టేడియం, బాలికల హై స్కూల్, పాలిటెక్నిక్ కాలేజ్ లు తదితర ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణాన్ని యుద్ధ ప్రాతిపదికన నిర్మాణాన్ని చేపట్టాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతాలలో ప్రజలకు రైతులకు అంతర్గత రోడ్ల నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలని అన్నారు. స్పందించిన ఆర్డీవో డిమాండ్ల ను జిల్లా కలెక్టర్ కు పంపిస్తారని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సిపిఎం తొర్రూర్ మండల కార్యదర్శి ఎండీ యాకుబ్, సిపిఐ తొర్రూర్ మండల బందు మహేందర్ , సిపిఐ మండల సహాయ కార్యదర్శి కిరణ్ , వీరన్న, జమ్మల శ్రీను, సోమిరెడ్డి, గుద్దేటి సాయి మల్లు, ఉమ్మగాని యాకయ్య, దొమ్మటి సోమయ్య వెంకట్ రెడ్డి, యాకన్న,తిమ్మిడి రవి, ధరావత్ యాకన్న, తాళ్ల వెంకటేశ్వర్లు, జితేందర్ రెడ్డి, వెంకన్న, మహేందర్ మురళి సంతోష్ నందీశ్వర్, సాయిలు, యాకయ్య, లక్ష్మయ్య, వెంకన్న,ఓమ బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.



## ఇబ్రహీంపట్నంలో బస్తీ దవాఖానా ప్రారంభం



**ఇబ్రహీంపట్నం, మహా:** మున్సిపాలిటీలో ప్రభుత్వ బస్తీ దవఖానాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఇబ్రహీంపట్నం కేంద్రంలో, ఖానాపూర్ గ్రామంలో ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందుబాటులో తెచ్చే విధంగా బస్తి దవఖానాలను ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్తీ దవఖానను ప్రైవేట్ దవఖానాలకు దీటుగా పనిచేయాలని అన్నారు. పేద ప్రజలకు వైద్య సేవలు మరింత చేరువ చేయటానికే బస్తీ దవఖానను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. బస్తీ దవఖానాలలో ప్రజలకు, వైద్యులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని పేద ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. ప్రజలందరూ బస్తీ దావఖానను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గుర్నాథ్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రవీందర్ సాగర్, ఏఎంసి డైరెక్టర్ దొంతరమోని రాజు, డాక్టర్ రాధిక, మాజీ ప్రజా ప్రతినిధులు, వైద్యులు, ప్రజలు, మున్సిపాలిటీ నాయకులు, కార్యకర్తలు పలువురు పాల్గొన్నారు.

### కుడా లో కొలువు దీరనున్న
## కొత్త ఉద్యోగులు

**హనుమకొండ, మహా:** కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ కుడా లో ఉద్యోగుల కొరత తీరనున్నది. హైదరాబాద్ 'న్యాక్' సంస్థలో శిక్షణ పొందిన 27 మంది సాంకేతిక నిపుణులు ఒప్పంద పద్ధతిలో విధుల్లోకి తీసుకునేందుకు రంగం సిద్ధమైందని తెలుస్తోంది. ఇప్పటికే తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నుంచి ఐదుగురు ఉద్యోగులు విధుల్లో చేరారు. ప్రణాళిక ఇంజనీరింగ్ విభాగాలను బలోపేతం చేసేందుకే చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం.

## పలు అభివృద్ధి పనులను పరిశీలించిన కమీషనర్



**వరంగల్, మహా:** జిడబ్ల్యూఎంసీ కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే శనివారం గ్రేటర్ వరంగల్ మహానగర పాలక సంస్థ పరిధిలోని పలు డివిజన్లలో చేపట్టిన అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మించిన కాజీపేటలో సీసీ రోడ్డు డ్రైన్, రంగంపేట లో సిసి రోడ్డు డ్రైన్..శివనగర్ లో సిసి రోడ్డు, 35వ డివిజన్ ఏసి రెడ్డి నగర్ కాలనీ సీసీ రోడ్డు,ఉర్సు గుట్ట వద్ద వినాయక నిమజ్జన ప్రాంత పరిశీలించారు. కొనసాగుతున్న పనులను నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ ప్రవీణ్ చంద్ర, ఈ ఈ లు శ్రీనివాస్, సంతోష్ బాబు, డి ఈ రాజ్ కుమార్, ఏఈలు రామన్న, హరికుమార్, రాగి శ్రీకాంత్, స్మార్ట్ సిటీ ప్రతినిధులు భాస్కర్ రెడ్డి, శ్రీనివాసరాజు, తదితరులు, పాల్గొన్నారు.

## మహా శివరాత్రి, రంజాన్ ఉత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేయండి

**బల్దియా కమిషనర్ డా. అశ్విని తానాజీ వాకడే**

వివిధ విభాగాల ఉన్నతాధికారులతో ఏర్పాట్ల పై సమీక్ష

నీటి సమస్యల పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు

**వరంగల్, మహా:** రానున్న మహా శివరాత్రి, పవిత్ర రంజాన్ పండుగల ఉత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేయాలని బల్దియా కమిషనర్ డా. అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. శనివారం బల్దియా ప్రధాన కార్యాలయంలో వివిధ విభాగాల ఉన్నతాధికారులతో మహా శివరాత్రి రంజాన్ పండుగల నేపథ్యం లో చేయాల్సిన ఏర్పాట్ల పై అధికారులతో నిర్వహించిన సమావేశం లో కమిషనర్ పాల్గొని సమర్థవంతంగా నిర్వహించుటకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భం గా కమిషనర్ మాట్లాడుతూ మహా శివరాత్రి సందర్భం గా బల్దియా పరిధి వరంగల్ నగర పరిధిలో 30 ఆలయాలు హన్మకొండ పరిధి లో 45 ఆలయాల్లో ఎలక్ట్రికల్ విభాగ అధికారులు లైటింగ్ ఏర్పాట్లు శానిటేషన్ అధికారులు ఆలయ ఆవరణలు పరిశుభ్రంగా ఉంచడం తో పాటు డస్ట్ బిన్ ల ఏర్పాటు ఉండాలని ముఖ్యంగా భక్తుల సౌకర్యార్థం మంచి నీటి ఏర్పాట్లు చేయాలని అంతే కాకుండా ఆలయ పరిసరాలలో ఫాగింగ్ చేయించాలని రంజాన్ పవిత్ర ఉపవాస దీక్షలు మార్చి 2 నుండి ఏప్రిల్ 2 వరకు కొనసాగే అవకాశం ఉన్నందున వరంగల్ పరిధి లో 55 మసీదుల్లో హన్మకొండ పరిధి లో 55 మసీదుల్లో ఎలక్ట్రికల్ విభాగం వారు సీరియల్ బల్బులతో అందంగా అలంకరించాలని జిల్లా కలెక్టర్ సూచించినట్లు అలాగే వక్ఫ్ బోర్డు నుండి తగు ఏర్పాట్లు చేసేలా చూడాలని మసీదుల్లో శానిటేషన్ తో పాటు



ఫాగింగ్ చేపట్టేలా చూడాలని షబ్ ఏ బరాత్ పండుగ సందర్భం గా అన్ని ఏర్పాట్లు చేయాలని ఈ సందర్భం గా కమిషనర్ అధికారులకు సూచించారు.

**నీటిసరఫరా తీరు పై సమీక్ష**

వేసవి కాలం నేపథ్యం లో బల్దియా వ్యాప్తంగా నీటి ఎద్దడి తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని కమిషనర్ అన్నారు. ఏమైనా సమస్యలు ఎదురైతే టోల్ ఫ్రీ నెం: 9701999645, 7207908583 వాట్స్ ఆప్ నం:9701999676 లలో సంప్రదించాలని ఈ సందర్భంగా కమిషనర్ నగర వాసులను కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఈ ప్రవీణ్ చంద్ర, బయాలజిస్ట్ మాధవరెడ్డి, ఎంహెచ్ఓ డా. రాజేష్, ఈ ఈ లు మహేందర్, శ్రీనివాస్, సంతోష్ బాబు, డి ఈ లు రంగారావు, రాజ్ కుమార్, రవి కిరణ్, సానిటరీ సూపర్వైజర్లు భాస్కర్, నరేందర్, తదితరులు, పాల్గొన్నారు.





## ఎమ్మెల్సీ ఎన్నికలు కాంగ్రెస్‌కు ప్రతిష్టాత్మకం

**తెలంగాణ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి**

- అషామాషీగా తీసుకోవద్దంటూ పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం
- కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు ఆఫీస్ లో సమీక్ష
- సమావేశంలో పలు సూచనలు

**ఆదిలాబాద్, మహా :** ఎమ్మెల్సీ ఎన్నికలు ఆశామాషిగా జరుగుతున్నవి కావని, ఎంతో ప్రతిష్టాత్మకమైనవని తెలంగాణ రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదిలాబాద్‌కు విచ్చేశారు. పట్టణంలోని కంది శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయం, ప్రజాసేవా భవన్‌లో జరిగిన సమీక్షా సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అవలంభించాల్సిన వ్యూహాలపై కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా పటేల్ రమేష్‌రెడ్డి మాట్లాడుతూ.... రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 14 నెలల తర్వాత నాలుగు ఉమ్మడి జిల్లాలకు సంబంధించి పట్టభద్రుల తీర్పును చూడబోతున్నామన్నారు. అందుకే ఈ ఎన్నికకు అంత ప్రాధాన్యత ఏర్పడిందన్నారు. కాంగ్రెస్ పరిపాలన పట్ల ఏ విధంగా ఉన్నారనే విషయం ఈ ఎన్నిక ద్వారా స్పష్టంగా తెలవబోతుందని అన్నారు. ప్రజల అభిమానాన్ని చూరగొన్నామా లేదా అనేది తెలిసిపోతుందన్నారు. పదేండ్లలో కేటీఆర్, హరీష్‌రావు విధ్వంసం చేశారన్నారు. రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటాలని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికలపై ఎమ్మెల్సీ ఎన్నికల గెలుపు ప్రభావం తప్పకుండా ఉంటుందని, పార్టీ శ్రేణులు కష్టపడి పనిచేసి ఎమ్మెల్సీగా నరేందర్‌రెడ్డిని గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని మాజీ ఎంపీ సోయం బాపురావు అన్నారు. దాదాపుగా ఈ ఎన్నికలు 42 నియోజకవర్గాల్లో జరగబోతున్నాయన్నారు. బీజేపీ వాళ్లు గెలిస్తే గడబిడ చేసి స్థానిక సంస్థల్లో పాగా వేసే అవకాశముందన్నారు. చాలా ప్రతిష్టాత్మకంగా తీసుకుని ముందుకుసాగాలని పేర్కొన్నారు. వ్యూహాత్మకంగా వ్యవహరిస్తూ ఎలాగైనా ఎమ్మెల్సీని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు.

**కష్టపడదాం**

కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ...ఏ ఎన్నిక అయినా ప్రతిష్టాత్మకమేనని అన్నారు. కాంగ్రెస్ పార్టీ నిర్మాణం కోసం కష్టించి పనిచేసే కార్యకర్తలను తమ గుండెల్లో పెట్టుకుని చూసుకుంటామన్నారు. క్షేత్రస్థాయిలో గెలుపే లక్ష్యంగా వ్యూహాలు ఉండాలన్నారు. 12 వేల మంది పట్టభద్రులపై ఫోకస్ చేసి కాంగ్రెస్ వైపు తిప్పుకుంటే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సునాయాసం అవుతుందన్నారు. అనంతరం ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమీక్షా సమావేశంలో మాజీ ఎంపీ సోయం బాపూరావు,డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజా రెడ్డి, తలమడుగు తాజా మాజీ జడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి, ఆత్రం సుగుణక్క,మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజాని,మాజీ జడ్పీటీసీలు కొండ గంగాధర్,బొల్లారం బాబన్న, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి రంగినేని శాంతన్ రావు,ఐఎన్టియూసి జిల్లా అధ్యక్షులు మునిగేల నర్సింగ్,కాంగ్రెస్ పార్టీ ఆదివాసీ జిల్లా అధ్యక్షులు సెడ్మాకి ఆనంద్ రావు,మాజీ మున్సిపల్ చైర్మన్ దిగంబర్ రావు పాటిల్,పద్మశాలి సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బూర్ల శంకరయ్య,సిపిఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి,మాజీ ఎంపీటీసీ వెంకన్న యాదవ్,నాయకులు లోక ప్రవీణ్ రెడ్డి,కౌన్సిలర్లు బండారి సతీష్, ఆవుల వెంకన్న,యెల్మెల్వార్ రామ్ కుమార్,తూర్పుటి భూమన్న తదితరులు పాల్గొన్నారు.

## పటేల్ రమేష్ రెడ్డికి ఘన స్వాగతం పలికిన కంది శ్రీనివాస రెడ్డి

**ఆదిలాబాద్, మహా :** ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఆదిలాబాద్ పర్యటను విచ్చేసిన తెలంగాణ టూరిజం కార్పోరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయం ప్రజా సేవాభవన్ ను సందర్శించారు.కాంగ్రెస్ శ్రేణులతో కలిసి కంది శ్రీనివాస రెడ్డి ఆయనకు పూలబొకే అందించి స్వాగతం పలికారు.శాలువాలతో సత్కరించారు.ఆయన వెంట డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజా రెడ్డి ,మాజీ జడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి,లోక ప్రవీణ్ రెడ్డి ,బాబాన్న,దేరా కృష్ణారెడ్డి తదితరులున్నారు.


## పీటీ మందలించడంతో సూసైడ్ చేసుకున్న విద్యార్థి



**ఉప్పల్, మహా:** మేడ్చెల్ జిల్లా ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఒక పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థి స్కూల్ బిల్డింగ్ పై నుంచి దూకి సూసైడ్ చేసుకున్న సంఘటన ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే బోడుప్పల్ ద్వారకా నగర్ కు చెందిన ధర్మారెడ్డి, సంగీత దంపతుల రెండవ కుమారుడు సంగారెడ్డి ఉప్పల్ న్యూ భారత్ నగర్ లోని సాగర్ గ్రామర్ స్కూల్లో 8వ తరగతి చదువుతున్నాడు. శనివారం ఉదయం క్లాస్ రూమ్ లో పీటీ ఆంజనేయులు వచ్చి ఇష్టం ఉన్నట్టు మందలించి కొట్టడంతో మనస్థాపానికి గురయ్యాడు విద్యార్థి.క్లాస్ టీచర్ కి వాష్ రూమ్ కి వెళ్లి వస్తానని చెప్పి నాలుగు అంతస్తుల బిల్డింగ్ పై నుంచి దూకి సూసైడ్ చేసుకున్నాడు. వెంటనే స్కూల్ కరస్పాండెంట్ దగ్గర్లో ఉన్న ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లాడు. వైద్యులు పరీక్షించి అప్పటికే విద్యార్థి మృతి చెందాడని నిర్ధారించారు. మృతదేహాన్ని గాంధీ హాస్పిటల్ కు తరలించారు. ఈ విషయం తెలుసుకున్న విద్యార్థి తల్లిదండ్రులు స్కూలుకు చేరుకున్నారు. స్కూల్ యాజమాన్యం విద్యార్థులను ఇంటికి పంపిస్తున్నారు. విద్యార్థి తల్లిదండ్రులు, బంధువులు స్కూలు విద్యార్థులు ఆందోళనకు దిగారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఉప్పల్ ఎంఈఓ మాట్లాడుతూ ఇలాంటి ఘటన జరగడం చాలా దురదృష్టకరం అని జరిగిన ఘటనపై విచారించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.స్కూల్ ను సీజ్ చేసిన ఎం ఈ ఓ రామారావు.

## శ్రీశ్రీశ్రీ లక్ష్మి నరసింహా స్వామి ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం

**కమిటీ సభ్యులను అభినందించిన ఎమ్మెల్యే రంగారెడ్డి**



**ఇబ్రహీంపట్నం, మహా:** శ్రీశ్రీశ్రీ లక్ష్మి నర్సింహా స్వామి ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారానికి హాజరై, నూతన ఆలయ కమిటీ సభ్యులను ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అభినందించారు. ఇబ్రహీంపట్నం మండలం, పోచారం గ్రామంలోని శ్రీశ్రీశ్రీ లక్ష్మి నర్సింహ్మా స్వామి వారి ఆలయ కమిటీ నూతన కమిటీ ప్రమాణ స్వీకారంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఆలయ కమిటీ సభ్యులు ఆలయ అభివృద్ధికి కట్టుబడి ఉండాలని తెలిపారు. పోచారంలోని శ్రీశ్రీశ్రీ లక్ష్మి నరసింహ్మా స్వామి వారి ఆలయం, ప్రఖ్యాతిగాంచిన పురాతన చరిత్ర కలిగిన ఆలయం అని కొనియాడారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఆలయ కమిటీ అన్ని సౌకర్యాలు కల్పించాలని, రాజకీయాలకు అతీతంగా ఆలయ అభివృద్ధికి సహకరించుకోవాలని అన్నారు. ఆలయ అభివృద్ధికి ఎమ్మెల్యేగా నేను అన్ని విధాలుగా సహకరిస్తానని తెలిపారు. ఆలయ కమిటి ముందుగా గుడి భూమి చుట్టూ కంచెని ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఆలయ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపైన ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గురునాథ్ రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ పాండురంగారెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ నరేష్, ముత్యాల రాజశేఖర్ రావు, ఏఎంసి వైస్ చైర్మన్ కర్ణాకర్ డైరెక్టర్ రామారావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంకటేష్, చిన్న, తిరుమల్ రెడ్డి, మంకాల దాసు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



## 10 కోట్ల వ్యయంతో రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే రంగారెడ్డి

**నియోజకవర్గ అభివృద్దే ధ్యేయంగా ముందుకు**

**ఇబ్రహీంపట్నం, మహా:** నియోజకవర్గంలో కన్స్ట్రక్షన్ అఫ్ రూరల్ రోడ్స్ ఫండ్స్ నిధులతో చేపట్టనున్న రోడ్డు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే రంగారెడ్డి శంకుస్థాపన చేశారు. ఆదిబట్ల మున్సిపాలిటీ, చింతపల్లి గూడ చౌరస్తా నుండి రాందాస్ పల్లి మీదుగా తుర్కయంజాల్ మున్సిపాలిటీలోని బ్రాహ్మణపల్లి వరకు రూ 10 కోట్ల 50లక్షల వ్యయంతో చేపట్టనున్న రోడ్డు అభివృద్ధి పనులకు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి. శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల రవాణా సౌకర్యార్థంగా ఉండేలా రోడ్డు పనులను త్వరగా చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను, కాంట్రాక్టర్ కు తెలిపారు. నియోజకవర్గం అభివృద్దే ధ్యేయంగా ముందుకు వెళ్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ సహకార సంఘాల చైర్మన్లు, వైస్ చైర్మన్లు, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, బ్లాక్, మండల, మున్సిపల్ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## బీజేపీ బీఆర్ఎస్ రెండూ ఒకటే

**పటేల్ రమేష్ రెడ్డి**



- నాణేనుకున్న బొమ్మా బొరుసు
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ కాడి వదిలింది
- బీజేపీ తో లోపాయికారి ఒప్పందం
- ఆదిలాబాద్ లో ఎమ్మెల్సీ ఎన్నికలపై ప్రెస్ మీట్ లో ధ్వజం
- కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి
- ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డిని గెలిపించండి
- పట్టభద్రులకు టూరిజం కార్పోరేషన్ చైర్మన్ విజ్ఞప్తి

**ఆదిలాబాద్, మహా :** బీజేపీ బీఆర్ఎస్ రెండూ ఒకటేనని ఆ రెండు పార్టీలు నాణేనుకున్న బొమ్మా బొరుసు లాంటివని తెలంగాణ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి ఆరోపించారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో శనివారం ఆదిలాబాద్ పర్యటన కు విచ్చేసిన ఆయన కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయం లో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్ లో పాల్గొని మాట్లాడారు.కరీంనగర్ ఆదిలాబాద్ నిజామాబాద్ మెదక్ జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికలో బీఆర్ఎస్ కాడి వదిలేసిందని కాంగ్రెస్ పార్టీని ఓడించేందుకు బీజేపీ తో లోపాయికారి ఒప్పందం కుదుర్చుకుదని దుయ్యబట్టారు.కాని అభివృద్ధి అంటేనే కాంగ్రెస్ అని తమ ప్రభుత్వంలోనే అభివృద్ధి జరిగింది జరుగుతుందన్నారు. అందుకే కాంగ్రెస్ పార్టీ బలపర్చిన ఎమ్మెల్సీ అభ్యర్థి బైట్కూరి నరేందర్ రెడ్డికే తమ మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాని పట్టభద్రులను కోరారు. ఎవరూ చేయని విధంగా అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నరాష్ట్రంగా తెలంగాణ దేశంలోనే ఆదర్శంగా నిలిచిందన్నారు.ఇచ్చిన ఆరు గ్యారెంటీ హామీలతో పాటు ఇవ్వని అనేక పథకాలను అమలుచేస్తూ కాంగ్రెస్ పార్టీ తమ చిత్తశుద్ధిని చాటుకుంటోందన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పనైపోయిందన్నారు. ఊరికే హరిష్‌రావు కేటీఆర్ అనవసరంగా మంచి చేస్తున్న కాంగ్రెస్ పార్టీ పై లేని పోని ఆరోపణలు చేస్తూ బురదజల్లే ప్రయత్నం చేస్తుందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎందుకు పోటీ చేయడంలేదో సమాధానం చెప్పాలన్నారు. కేవలం బీజేపీ కి మేలు చేసేందుకే పక్కకి తప్పుకున్నదన్నారు. బీజేపీది మత రాజకీయాలతో లబ్ధిపొందే ప్రయత్నమన్నారు.పార్లమెంట్ ఎన్నికల సమయంలో ఆదిలాబాద్ ప్రజలకిచ్చిన ప్రధాని మోదీ హామీలేమయ్యాయని ప్రశ్నించారు. ఉద్యోగాల హామీ కుటుంబానికి 10 లక్షలు ఎక్కడ అని ప్రశ్నించారు. సీసీఐ పునరుద్ధరణ, ఎయిర్ పోర్ట్,టెక్స్‌టైల్ కారిడార్, ఆర్మూర్ రైల్వేలైన్ లాంటి హామీల అమలు మరిచిందన్నారు.ఆదిలాబాద్ అభివృద్ధి జరుగుతుందని నమ్మి ఓట్లేసి గెలించిన ఎంపీ ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. మొన్న బడ్జెట్ లో ఒక్క రూపాయి కూడా తీసుకురాలేదని విమర్శించారు. ఇదంతా మేధావులైన పట్టభద్రులు గమనించాలని అభివృద్ధి చేస్తున్న పార్టీ అభ్యర్థి ,ముప్పై ఏళ్లుగా ప్రజా క్షేత్రం లో ఉంటూ విద్యా సంస్థల ద్వారా సేవలందిస్తున్న విద్యావేత్త పూట్కూరి నరేందర్ రెడ్డిని ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని కోరారు..అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన ఏడాదిలోనే 54వేల ఉద్యోగాలను భర్తీ చేసి రికార్డు సృష్టించదని అన్నారు. 25 లక్షల మంది రైతులకు ఏకకాలంలో 21వేల కోట్ల రుణమాఫీ చేసిందని గుర్తు చేసారు.పదేళ్ల పాలనలో ఒక్క నోటిఫికేషన్ కాని గ్రూప్ పరీక్షలు కాని నిర్వహించలేని అసమర్థ ప్రభుత్వంగా బిఆర్ఎస్ మిగిలిపోయిందన్నారు. ఈ ఎమ్మెల్సీ ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థి నరేందర్ రెడ్డికే తమ మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమం లో మాజీ ఎంపీ సోయం బాపూరావు,డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజా రెడ్డి, ఆత్రం సుగుణక్క, తలమడుగు తాజా మాజీ జడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి,మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజాని,మాజీ జడ్పీటీసీలు కొండ గంగాధర్,బొల్లారం బాబన్న, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి రంగినేని శాంతన్ రావు,ఐఎన్టియూసి జిల్లా అధ్యక్షులు మునిగేల నర్సింగ్,కాంగ్రెస్ పార్టీ ఆదివాసీ జిల్లా అధ్యక్షులు సెడ్మాకి ఆనంద్ రావు,మాజీ మున్సిపల్ చైర్మన్ దిగంబర్ రావు పాటిల్,పద్మశాలి సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బూర్ల శంకరయ్య,సిపిఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి,మాజీ ఎంపీటీసీ వెంకన్న యాదవ్,నాయకులు లోక ప్రవీణ్ రెడ్డి,కౌన్సిలర్లు బండారి సతీష్, ఆవుల వెంకన్న,యెల్మెల్వార్ రామ్ కుమార్,తూర్పుటి భూమన్న తదితరులు పాల్గొన్నారు.

## అల్లువాడ,టుంబలి లో అక్రమమైనింగ్ పట్టించు కోని మైనింగ్ అధికారు

**చర్యలు తీసుకోవాలి అని సిపిఎం డిమాండ్**

**పార్వతీపురం, మన్యం జిల్లా మహా:** జియ్యమ్మ వలస మండలంలో, అల్లువాడ ,టుంబిలి లో అక్రమంగా కంకరు తవ్వుతున్నారు అని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి కొల్లి గంగు నాయుడు అన్నారు అల్లువాడ లో అక్రమంగా తవ్వుతున్న కాంకరు మైనింగ్ ప్రాంతాన్ని పరిశీలించారు , ఈ సందర్భంగా గంగు నాయుడు మాట్లాడుతూ జియ్యమ్మ వలస మండలంలో కాంట్రాక్టర్ లు అక్రమంగా మైనింగ్ చేసి కంకరు తవ్వకు వెళ్లిపోతున్నా మైనింగ్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని అన్నారు, జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో కుండలు చేసే కులస్తులు కుండలు చేసుకోవడానికి మట్టి తవ్వితే కేసులు పెట్టే అధికారులు మెయిన్ రోడ్ కు ప్రక్కనే అక్రమంగా కంకరు తవ్వుకువెళ్లిపోతే మైనింగ్ అధికారులు కు కనిపించలేదా అని ప్రశ్నించారు, లేక పోతే అధికార పార్టీ నేతలు కు భయపడి పట్టించుకోవడం లేదా అని అన్నారు జియ్యమ్మ వలస మండలంలో అక్రమ మైనింగ్ చెస్తే చూసి చూడనట్లు పోతున్నారని అన్నారు ఇప్పటి కైనా మైనింగ్ అధికారులు జియ్యమ్మ వలస మండలంలోజరుగుతున్న అక్రమంగా తవ్వుతున్న కంకర్ క్వారీలు ఆపాలని డిమాండ్ చేశారు , లేక పోతే ఆందోళన చేస్తామని అన్నారు ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి కె సీతారాం పాల్గొన్నారు.

## ఫుట్ పాత్ ఆక్రమణల పై జిహెచ్ఎంసి కోరడా

**ఉప్పల్,మహా:** ఉప్పల్ లోని మండే మార్కెట్ ప్రధాన రహదారి పై ఫుట్ పాత్ లను ఆక్రమించి నిర్మించిన కట్టడాల కూల్చివేత చేపట్టిన జిహెచ్ఎంసి అధికారులు,ఉప్పల్ ప్రధాన రహదారులు సహా, గల్లీలలో అనేకమంది ఇంటి ఎదుట మెట్లు నిర్మించడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నట్లు జీహెచ్ఎంసీ అధికారులు అభిప్రాయపడ్డారు. మండే మార్కెట్ రోడ్లో రోడ్డుపై మెట్లు నిర్మించిన విషయాన్ని తెలుసుకున్న అధికారులు ఎక్కడకక్కడ వాటిని తొలగించారు. ట్రాఫిక్ సమస్య పరిష్కారం కోసం తొలగించక తప్పదని, అందరూ సహకరించాలని ఉప్పల్ ప్రజలను జీహెచ్ఎంసీ అధికారులు విజ్ఞప్తి చేశారు.పోలీస్ బందోబస్తు నడుమ ఫుట్ పాత్ ఆక్రమణలు తొలగించినా అధికారులు.ఇకముందు ఫుట్ పాత్ ఆక్రమణలు జరుగితే కఠిన చర్యలు తప్పవంటున్న అధికారులు.

## ఆర్థిక వ్యవస్థకు కొత్త సవాళ్లు

**పెరుగుతున్న అన్‌సెక్యూర్డ్ రుణాలు, ఊహాజనిత ట్రేడింగ్‌పై ఆర్బీఐ డీజీ ఆందోళన**




**ముంబై :** వ్యక్తిగత, క్రెడిట్ కార్డ్, విద్యార్థి తదితర తాకట్టులేని రుణాలు పెరుగుతుండటం, క్యాపిటల్ మార్కెట్లలో ఉత్సాహంగా నడుస్తున్న ఊహాజనిత డెరివేటివ్స్ ట్రేడింగ్‌లు ఆర్థిక వ్యవస్థకు కొత్త సవాళ్లను తెచ్చిపెడుతున్నాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) డిప్యూటీ గవర్నర్ ఎం రాజేశ్వర్ రావు ఒకింత ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో వేగంగా విస్తరిస్తున్న డిజిటల్ ఎకానమీతో అవకాశాలూ.. ఇబ్బందులూ రెండూ ఉన్నాయన్నారు. శుక్రవారం ఇక్కడ సూక్ష్మ ఆర్థిక, బ్యాంకింగ్, ఫైనాన్స్ అంశాలపై ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం) కోజీకోడ్, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సంయుక్తంగా నిర్వహించిన సదస్సులో రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. స్వల్పకాలిక లాభాలపై ఉత్సుకత.. వ్యక్తుల్లో దీర్ఘకాలిక ఆర్థిక భద్రతను కనుమరుగయ్యేలా చేస్తున్నదన్నారు. అందుకే ఆర్థిక సంస్థలు రుణాల విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యంగా ఉండకూడదని, కస్టమర్లకూ ఆర్థికపరమైన విషయాల్లో ఉన్న రిస్కులను తెలియజేసి.. వారిలో అవగాహనను పెంచాలని సూచించారు. మోసాల నుంచి వినియోగదారులను రక్షించడంలో ఆర్థిక అక్షరాస్యతే కీలకమన్నారు.

## కియా సెల్టోస్ 2025 వెర్షన్

**ధర రూ.11.13 లక్షలు**



**న్యూఢిల్లీ:** సరికొత్త సెల్టోస్‌ను దేశీయ మార్కెట్‌కు పరిచయం చేసింది కియా ఇండియా. పాతదాంతో పోలిస్తే ఈ నయా వెర్షన్‌ను భారీ మార్పులు చేసినట్లు, ముఖ్యంగా టెక్నాలజీ పరంగా యువతను ఆకట్టుకునే విధంగా డిజైన్ చేసినట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. ఈ కారు రూ.11.13 లక్షల నుంచి రూ.20.5 లక్షల లోపు ధరల శ్రేణిలో లభించనున్నది. ఎనిమిది అంగుళాల ఇన్ఫోటైన్‌మెంట్ స్క్రీన్, ఎల్ఈడీ హెడ్‌లైట్స్, ఎల్ఈడీ ఫాగ్ ల్యాంప్స్, గ్లాస్ బ్లాక్ ఎక్స్‌టీరియర్, ఆరు స్పీకర్ ఆడియో సిస్టమ్, స్టీరింగ్‌మౌంటెడ్ కంట్రోల్స్, టైప్‌సీ చార్జింగ్ పోర్ట్, రియర్ ఏసీ వెంట్స్, 1.5 లీటర్ల పెట్రోల్, టర్బో పెట్రోల్, టర్బో డీజిల్ ఇంజిన్‌తో తయారు చేసింది.

## ఆరేండ్లలో రద్దీ రెట్టింపు

**2030-31కి హైదరాబాద్ ఎయిర్‌పోర్టులో ఐదు కోట్ల ప్రయాణీకులు : జీఎమ్మార్ కార్గో టెర్మినల్ విస్తరణకు రూ.370 కోట్ల పెట్టుబడి**

హైదరాబాద్ ఎయిర్‌పోర్టులో రాబోయే ఆరేండ్లలో ప్రయాణీకుల రద్దీ దాదాపు రెట్టింపు కానుందని జీఎమ్మార్ గ్రూప్ అంచనా వేస్తున్నది. ఇక్కడి రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని (ఆర్‌జీఐఏ) జీఎమ్మార్ గ్రూప్ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే జీఎమ్మార్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ (జీహెచ్ఐఏఎల్) సీఈవో ప్రదీప్ ఫణికర్ పీటీఐకిచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. 203031నాటికి హైదరాబాద్ ఎయిర్‌పోర్టులో ప్యాసింజర్ ట్రాఫిక్ ఏటా 50 మిలియన్ల (5 కోట్లు)కు చేరవచ్చన్నారు. ప్రస్తుతం 29 మిలియన్లు (2.9 కోట్లు)గా ఉండొచ్చని చెప్పారు. 'దేశంలోని మెట్రో నగరాల్లో అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ఎయిర్‌పోర్టుల్లో హైదరాబాద్ ముందున్నది. గత ఏడాది మార్చికల్లా విమానాశ్రయంలో ప్రయాణీకుల రద్దీ 2.5 కోట్లుగా ఉన్నది. ఈ ఏడాది మార్చి ఆఖరుకు 2.9 కోట్లుగా రికార్డు కాగలదు. 2031 మార్చి 31 నాటికి ఇది 5 కోట్లను తాకుతుందని నమ్ముతున్నాం.' అని ప్రదీప్ తెలియజేశారు. నిజానికి ఇప్పటికే ఏటా 4 కోట్ల ప్రయాణీకుల రద్దీని తట్టుకునేలా ఎయిర్‌పోర్టులో కావాల్సిన అన్ని మౌలిక సదుపాయాలను దశలవారీగా అభివృద్ధిపర్చినట్టు చెప్పారు. 2008లో 1.2 కోట్ల ప్రయాణీకుల రద్దీ సామర్థ్యంతో ఈ ఎయిర్‌పోర్టును నిర్మించిన సంగతి విదితమే. కాగా, 2023తో పోల్చితే గత ఏడాది ఎయిర్‌పోర్టుకు 36 లక్షల ప్రయాణీకులు పెరిగారని ప్రదీప్ వివరించారు. ఢిల్లీలో మినహా దేశంలోని మరే ఇతర ఎయిర్‌పోర్టుల్లోనూ ఈ స్థాయి పెరుగుదల లేదని గుర్తుచేశారు.



### కార్గో టెర్మినల్ విస్తరణ

ఎయిర్‌పోర్ట్‌లో ప్రస్తుతమున్న కార్గో టెర్మినల్‌ను దాదాపు రూ.215 కోట్లతో విస్తరించే దిశగా వెళ్తున్నామని, రూ.155 కోట్లతో కొత్తగా మరో టెర్మినల్ నిర్మించబోతున్నామని మొత్తం రూ.370 కోట్ల పెట్టుబడి పెట్టనున్నామని ప్రదీప్ ఈ సందర్భంగా వెల్లడించారు. నూతన టెర్మినల్‌తో వార్షిక సామర్థ్యం 4 లక్షల టన్నులకు చేరగలదన్నారు. మే నెలలో నిర్మాణం పూర్తి కావచ్చని, జూన్ లేదా జూలైనాటికి అందుబాటులోకి రావచ్చన్నారు. కాగా, ఈ విమానాశ్రయంలో ప్రస్తుతం గంటకు 3435 విమానాల రాకపోకలు జరుగుతున్నాయని, 42దాకా కూడా వచ్చిపోయే సామర్థ్యం ఇక్కడి రన్‌వేలకు ఉందని చెప్పారు. గత ఆర్థిక సంవత్సరం (202324) రూ.2,700 కోట్లకుపైగా ఏకీకృత నిర్వహణ ఆదాయాన్ని అందుకున్నామని, ప్రయాణీకుల రద్దీ పెరుగుతున్న దృష్ట్యా రాబోయే సంవత్సరాల్లో 10 శాతం వృద్ధిని అంచనా వేస్తున్నట్టు వెల్లడించారు. అయితే 6570 శాతం ఏరోనాటికల్ వైపు నుంచే ఆదాయం వస్తున్నదన్న ఆయన ఈ ఆర్థిక సంవత్సరం (202425) 1.80 లక్షల టన్నుల కార్గో రవాణా జరుగవచ్చన్న ఆశాభవాన్ని కనబర్చారు. ఇది గతంతో పోల్చితే 20 శాతం ఎక్కువ. ఇక అంతర్జాతీయ షిప్పింగ్ నుంచే మెజారిటీ ఆదాయం వస్తున్నది. ఎర్ర సముద్రంలో సంఘర్షణలతో ఇంటర్నేషనల్ కార్గో పెరిగిందన్నారు. కాగా, జీహెచ్ఐఏఎల్‌లో జీఎమ్మార్ గ్రూప్‌నకు 74 శాతం వాటా ఉంటే.. ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, తెలంగాణ ప్రభుత్వాలకు 13 శాతం చొప్పున వాటాలున్నాయి.

## రెడింగ్టన్‌లో ఐఫోన్16పై ఆఫర్లు



దేశవ్యాప్తంగా యాపిల్ ఫోన్లను విక్రయిస్తున్న రెడింగ్టన్.. ఐఫోన్లపై భారీ రాయితీ కల్పిస్తున్నది. ఇటీవల మార్కెట్లోకి విడుదల చేసిన ఐఫోన్ 16ఈపై పలు బ్యాంకుల కార్డులపై రూ.4 వేల వరకు ఇన్‌స్టంట్ క్యాష్‌బ్యాక్‌ను అందిస్తున్నట్లు తెలిపింది. ఐసీఐసీఐ బ్యాంక్, కొటక్ మహీంద్రా బ్యాంక్, ఎస్బీఐ బ్యాంకులకు చెందిన క్రెడిట్ కార్డులతో కొనుగోలు చేసిన వారికీ ఈ ప్రత్యేక ఆఫర్ వర్తించనున్నది. అలాగే రూ.6 వేల వరకు ఎక్స్ఛేంజ్ బోనస్ పొందవచ్చును.



## 20 ఏళ్లు ముందే రాజకీయాల్లోకి వచ్చి ఉంటే మరోలా ఉండేది

**కమల్‌హాసన్**



తాను రెండు దశాబ్దాలు ముందుగానే రాజకీయ ప్రవేశం చేసి ఉంటే పరిస్థితి మరోలా ఉండేదని నటుడు, మక్కల్ నీది మయ్యం పార్టీ అధ్యక్షుడు కమల్ హాసన్ అన్నారు. రాజకీయంగా తానెంతో ఉన్నత స్థితిలో ఉండేవాడినని చెప్పారు. అప్పట్లో రాజకీయాల్లోకి రాకుండా వెనుకంజ వేయటమే తన మొదటి ఓటమి అని ఆయన తెలిపారు. తన పార్టీ ఎనిమిదో వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం ఆళ్వార్‌పేటలోని పార్టీ కార్యాలయంలో ఆయన జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన రాజకీయ పయనంలో అభిమానులు వేరు, ఓటర్లు వేరు అనే విషయాన్ని గ్రహించగలిగానని కమల్‌హాసన్ చెప్పారు. పార్టీకి చివరి ఓటరు ఉన్నంత వరకు తమ పార్టీ సేవలు కొనసాగిస్తామని అన్నారు. ఇరవై ఏళ్ల క్రితం తాను రాజకీయ ప్రవేశం చేసి ఉండాలని, అప్పట్లో తగు నిర్ణయం తీసుకుని ఉంటే తాను రాజకీయాల్లో ఉన్నతస్థితిలో ఉండేవాడినని అభిప్రాయపడ్డారు. ఇక తమిళ భాష గురించి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలందరినీ సమైక్యపరిచేది తమిళ భాషేనని, తాను ఆత్మవిశ్వాసంతో ముందుకు దూసుకుపోతుండటానికి కారణం తమిళ ప్రజలేనని కమల్ చెప్పారు. ఆకాశమంత ఎత్తుకు ఎదిగిన తమిళభాషను ఎవరూ కిందకు దించలేరని అన్నారు. అదేవిధంగా ఈ ఏడాది పార్లమెంటులో తొలిసారి పార్టీ వాణి వినిపించనుందని అన్నారు. ఎందుకంటే ఈ ఏడాది జూలైలో తమిళనాడులోని కొన్ని రాజ్యసభ స్థానాలు ఖాళీ కానున్నాయి. దాంతో ముందు చేసుకున్న ఒప్పందం ప్రకారం అధికార డీఎంకే కమల్ పార్టీకి రెండు రాజ్యసభ స్థానాలు కేటాయించనుంది. కమల్ హాసన్‌తోపాటు ఆయన పార్టీకి చెందిన మరో వ్యక్తి రాజ్యసభకు వెళ్లనున్నారు. ఈ నేపథ్యంలో ఆయన తాజా వ్యాఖ్యలు చేశారు. అంతేగాక వచ్చే ఏడాది రాష్ట్ర అసెంబ్లీలో కూడా పార్టీ సభ్యులుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీ శ్రేణులంతా తోచినంతలో ప్రజలకు సేవ చేస్తూ ఉండాలని, అప్పుడే పార్టీకి బంగారు భవిష్యత్తు ఉంటుందని కమల్ హాసన్ అన్నారు.

## ఉదయం 11 గంటలకు ఎమ్మెల్యేల ప్రమాణస్వీకారం.. మధ్యాహ్నం 2 గంటలకు స్పీకర్ ఎన్నిక



ఢిల్లీ లో కొత్త ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత నూతన అసెంబ్లీ తొలిసారి సమావేశం కాబోతోంది. ఫిబ్రవరి 24న అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు మొదలుకానున్నాయి. సమావేశాలు మొదలవగానే ముందుగా ప్రొటెం స్పీకర్ ను ఎన్నుకుంటారు. ఆ తర్వాత ఉదయం 11 గంటల నుంచి కొత్త ఎమ్మెల్యేల ప్రమాణస్వీకారాలు జరుగుతాయి. ఆ తర్వాత లంచ్ విరామం ఉంటుంది. లంచ్ తర్వాత మధ్యాహ్నం 2 గంటలకు సభ మొదలవగానే స్పీకర్‌ను ఎన్నుకుంటారు. ఇక సమావేశాల రెండో రోజైన ఫిబ్రవరి 25న అసెంబ్లీలో ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా ప్రసంగిస్తారు. గవర్నర్ ప్రసంగం ముగియగానే ప్రభుత్వం కాగ్ నివేదికను అసెంబ్లీలో ప్రవేశపెడుతుంది. మూడో రోజైన ఫిబ్రవరి 27న ఉదయం నుంచి గవర్నర్ ప్రసంగంపై చర్చ జరుగుతుంది. చర్చ ముగిసిన తర్వాత డిప్యూటీ స్పీకర్‌ను ఎన్నుకుంటారు. ఆ తర్వాత అసెంబ్లీ సమావేశాలను నిరవధికంగా వాయిదా వేస్తారు. కాగా ఇటీవల జరిగిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించింది. మొత్తం 70 అసెంబ్లీ స్థానాల్లో బీజేపీ 48 స్థానాలు గెలుచుకుంది. సొంత మెజారిటీతో అధికారం దక్కించుకుంది. అధికార ఆప్ కేవలం 22 స్థానాలు మాత్రమే నెగ్గి ప్రతిపక్షంలో కూర్చుంది.




## పాక్ జైలు నుంచి 22 మంది భారత జాలర్లు విడుదల

**నేడు వాఘా సరిహద్దు వద్ద అప్పగించే అవకాశం..!**

పాకిస్థాన్ కరాచీలోని మాలిర్ జైలులో ఉన్న 22 మంది భారతీయ జాలర్లు విడుదలయ్యారు. ఆయా జాలర్లను శనివారం భారత్‌కు అప్పగించే అవకాశం ఉన్నది. మత్స్యకారుల విడుదలపై మాలిర్ జైలు సూపరింటెండెంట్ అర్షద్ షా మీడియాకు సమాచారం ఇచ్చారు. ఈదీ ఫౌండేషన్ అధ్యక్షుడు ఫైసల్ ఈదీ జాలర్లు లాహోర్‌కు చేరుకునేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రయాణ ఖర్చులను భరించడంతో పాటు వారికి పలు కానుకలతో పాటు ఆర్థిక సహాయాన్ని సైతం అందించారు. జాలర్లు లాహోర్ నుంచి భారత్‌కు తిరిగి చేరుకోనున్నారు. జాలర్లు సుదీర్ఘంగా జైలు శిక్ష అనుభవించారని.. ఆయా కుటుంబాల వేదనను ఎత్తిచూపుతూ.. శిక్షాకాలం పూర్తయిన వెంటనే వారిని విడుదల చేసి స్వదేశానికి తిరిగి పంపేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. దురుద్దేశం లేకుండా పాక్ జలాల్లోకి ప్రవేశించిన వారి విషయంలో దయతో ఉండాలని కోరారు. జాలర్లను పాక్ అధికారులు వాఘా సరిహద్దుకు తీసుకువచ్చి.. అక్కడ భారత అధికారులకు అప్పగించే ప్రక్రియను పూర్తి చేస్తారు. ఆ తర్వాత భారత అధికారులు వారిని సొంత ఊళ్లకు పంపేందుకు ఏర్పాట్లు చేయనున్నారు. వాస్తవానికి ఒక దేశం జాలర్లు.. మరో దేశం జలాల్లోకి ప్రవేశించిన సమయంలో అరెస్టు చేస్తుంటారు. ఈ ఏడాది జనవరి ఒకటిన ఇరు దేశాలు ఖైదీల జాబితాను మార్పుడు చేసుకున్నాయి. ఈ జాబితా మేరకు.. పాకిస్థాన్‌లో 266 మంది భారతీయ ఖైదీలు ఉండగా.. ఇందులో 217 మంది జాలర్లు ఉన్నారు. ఇక భారత్‌లో 81 మంది జాలర్లు సహా 462 మంది పాక్ ఖైదీలు ఉన్నారు. ఇదిలా ఉండగా.. శ్రీలంక జైళ్లలో మగ్గుతున్న జాలర్లను విడిపించేందుకు చర్యలు తీసుకోవాలని తమిళనాడు సీఎం స్టాలిన్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. శ్రీలంక నావికాదళం జాలర్లను భారీగా అరెస్టు చేస్తుందంటూ ఆందోళన వ్యక్తం చేశారు. జాలర్లు, వారి పడవలను తక్షణమే విడుదల చేసేలా దౌత్యపరంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## ఆర్బీఐ మాజీ గవర్నర్ శక్తికాంత దాస్‌కు మరో కీలక పదవి



ఆర్బీఐ మాజీ గవర్నర్ శక్తికాంత దాస్ కు మరో కీలక పదవి దక్కింది. ప్రధాని నరేంద్రమోదీ కి ప్రిన్సిపల్ సెక్రెటరీగా గా ఆయన నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర క్యాబినెట్ అపాయింట్‌మెంట్స్ కమిటీ నోటిఫికేషన్ విడుదల చేసింది. శక్తికాంత దాస్ పదవీ కాలం నరేంద్రమోదీ ప్రధానిగా ఉన్నంత వరకు లేదంటే తదుపరి ఉత్తర్వులు ఇచ్చేవరకు ఏది ముందైతే అప్పటిదాకా ఉంటుందని కమిటీ తన నోటిఫికేషన్‌లో పేర్కొంది. ప్రధాని ప్రిన్సిపల్ సెక్రెటరీగా శక్తికాంత దాస్ త్వరలో బాధ్యతలు స్వీకరించనున్నారు. ఆర్బీఐ గవర్నర్‌గా ఆరేళ్లు పనిచేసిన ఆయనకు ఫైనాన్షియల్ అడ్మినిస్ట్రేషన్‌లో విశేష అనుభవం ఉంది. ఎకనామిక్స్, ఫైనాన్స్, మినరల్స్, రెవెన్యూ శాఖలతోపాటు జీ20 షెర్పా, ఏడీబీ బ్యాంక్, ప్రపంచ బ్యాంక్ వ్యవహారాలపై మంచి పట్టుంది. దాస్ నియామకంతోపాటు నీతి ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రమణ్యం పదవీకాలాన్ని కూడా ఒక ఏడాది పాటు పొడిగించారు. బీవీఆర్ సుబ్రమణ్యం ప్రస్తుత పదవీకాలం 2025 ఫిబ్రవరి 24తో ముగియనుంది. తాజా పొడగింపువల్ల ఆయన 2026 ఫిబ్రవరి 24 వరకు పదవిలో కొనసాగనున్నారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి అయిన సుబ్రమణ్యం 1987 బ్యాచ్‌కు చెందిన వారు. రెండేళ్ల పదవీకాలానికి ఆయనను 2023 ఫిబ్రవరిలో నీతి ఆయోగ్ సీఈవోగా నియమించారు. సోమవారంతో ఆ గడువు ముగియనుండటంతో మరో ఏడాదిపాటు పొడిగించారు.

## కొనసాగుతున్న మహాకుంభమేళా.. త్రివేణీ సంగమంలో పుణ్యస్నానాలు చేసిన కేంద్ర మంత్రి

ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక కార్యక్రమం మహాకుంభమేళా ముగింపు దశకు చేరుకుంది. మరో ఐదు రోజుల్లో మహాకుంభమేళా ముగియనుంది. ఈ క్రమంలో గంగ, యమున, సరస్వతి నదులు కలిసే పవిత్ర త్రివేణీ సంగమంలో పుణ్య స్నానాలు చేసేందుకు భక్తులు భారీ సంఖ్యలో తరలివస్తున్నారు. 45 రోజుల పాటు జరిగే ఈ కుంభమేళాకు సామాన్య భక్తులతోపాటు ప్రముఖులు కూడా తరలివస్తున్నారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షా సహా పలువురు కేంద్ర మంత్రులు, పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, గవర్నర్లు ఇప్పటికే త్రివేణీ సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించిన విషయం తెలిసిందే. తాజాగా కేంద్ర మంత్రి జేపీ నడ్డా మహాకుంభమేళాను సందర్శించారు. యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌తో కలిసి త్రివేణీ సంగమంలో పవిత్ర స్నానాలు ఆచరించారు. అనంతరం అక్కడ ప్రత్యేక పూజలు చేశారు. కాగా, పౌష్ పూర్ణిమ సందర్భంగా జనవరి 13వ తేదీన మహాకుంభమేళా ప్రారంభమైంది. ఫిబ్రవరి 26 శివరాత్రి వరకూ ఈ కుంభమేళా కొనసాగనుంది. దాదాపు 45 రోజులపాటూ జరిగే ఈ మహా కుంభమేళాకు ప్రపంచం నలుమూలల నుంచి దాదాపు 50 కోట్ల మంది భక్తులు వస్తారని యూపీ ప్రభుత్వం ముందుగా అంచనా వేసింది. అయితే, అంచనాలకు మించి భక్తులు తరలివస్తున్నారు. 41 రోజుల వ్యవధిలోనే దాదాపు 60 కోట్ల మంది భక్తులు స్నానాలు ఆచరించినట్లు యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ వెల్లడించారు.







## చాలా బాగున్నావు.. ముఖ్యంగా నీ కళ్లు..

సాధారణంగా సినిమా పరిశ్రమలో ఒక హీరోయిన్‌ని మరో హీరోయిన్ పొగడటం అరుదు. కానీ అలియా భట్ మాత్రం ఇగో పక్కన పెట్టి, తన తోటి హీరోయిన్ రష్మిక మందన్నాను పొగడ్తలతో ముంచెత్తింది. విక్కీ కౌశల్, రష్మిక జంటగా నటించిన 'ఛావా' సినిమా ఇటీవలే విడుదలైన విషయం తెలిసిందే. దేశవ్యాప్తంగా పాజిటివ్ టాక్‌తో భారీ వసూళ్లతో దూసుకుపోతున్న 'ఛావా'ను రీసెంట్‌గా అలియాభట్ చూసింది. వెంటనే ఇన్‌స్టా ద్వారా తన అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. ' 'ఛావా' ఓ అద్భుతం. ముందుగా డైరెక్టర్ లక్ష్మణ్ ఉటేకర్‌కి అభినందనలు. చాలా గొప్పగా తీశారు. విక్కీకౌశల్ అద్భుతంగా నటించారు. నా అభిమాన నటుడు అక్షయ్ ఖన్నా ఔరంగజేబుగా మారిపోయారు. ఇక రష్మిక.. 'చాలా అందంగా ఉన్నావు.. ముఖ్యంగా నీ కళ్లు..' ' అంటూ ప్రశంసలు గుప్పించింది అలియా భట్. అలియా పోస్ట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నది.

## మెల్లగా స్పీడ్ పెంచుతున్న క్యూట్ ఆషిక..

### మెగాస్టర్ సినిమాతో అమ్మడి గేరు మారేనా..

ఆషికా రంగనాథ్.. కన్నడ ఇండస్ట్రీ నుంచి టాలీవుడ్ కు వచ్చిన భామలు ఆషికా రంగనాథ్ ఒకరు. కన్నడలో క్రేజీ బాయ్ అనే సినిమా ద్వారా కథానాయికగా పరిచయమైంది. ఆ తర్వాత తన మాతృభాషలోనే ఎన్నో ఆఫర్స్ అందుకుంటూ అతి తక్కువ సమయంలోనే తనకంటూ మంచి గుర్తింపు తెచ్చుకుంది. తెలుగులో కళ్యాణ్ రామ్ సరసన డేవిల్ అనే చిత్రంలో నటించింది. కానీ ఈ మూవీ అంతగా మెప్పించలేదు. దీంతో ఆషికాకు సరైన గుర్తింపు రాలేదు. కానీ ఆ తర్వాత నాగార్జున జోడిగా నా సామిరంగా సినిమాతో సూపర్ హిట్ అందుకుంది. దీంతో తెలుగులో ఆషికాకు మంచి గుర్తింపు వచ్చింది. ఆ తర్వాత తమిళంలో యంగ్ హీరో అధర్వకు జంటగా పట్టత్తు అరసన్ చిత్రంలో నటించింది. అలాగే సిద్ధార్థ్ జోడిగా మిస్ యూ సినిమాలో నటించింది. ఇలా ఈ చిన్నది తెలుగు తమిళ్ భాషల్లో అవకాశాలు అందుకుంటుంది.

## హిచ్ కాక్ పై తెలుగులో బుక్ తీసుకురావడం అభినందనీయం: మెగాస్టార్ చిరంజీవి

ప్రపంచ సినిమాపై తనదైన ముద్ర వేసిన దర్శకుల్లో ఆల్ఫ్రెడ్ హిచ్‌కాక్ ఒకరు. సస్పెన్స్ థ్రిల్లర్స్ తీసే దర్శక రచయితలకు ఆయన సినిమాలే ఇన్ స్పిరేషన్. ఆల్ఫ్రెడ్ హిచ్‌కాక్ 125వ జయంతి సందర్భంగా, అలానే ఆయన తొలి సినిమా విడుదలై వందేళ్లు అయిన సందర్భంగా హిచ్‌కాక్ సినీ జీవితంపై 'మాస్టర్ ఆఫ్ సస్పెన్స్ హిచ్‌కాక్' పేరుతో సీనియర్ జర్నలిస్ట్, సినీ రచయిత పులగం చిన్నారాయణ – ఐఆర్‌టీఎస్ అధికారి రవి పాడితో కలిసి పుస్తకం తీసుకొచ్చారు. డిసెంబర్ 18న ఫస్ట్ కాపీ విడుదలైంది. ఐదు రోజుల్లో పుస్తకాలు అన్నీ అమ్ముడు కావడంతో సరికొత్త చేర్పులతో సెకండ్ ఎడిషన్ లాంచ్ చేశారు. మాస్టర్ ఆఫ్ సస్పెన్స్ హిచ్‌కాక్' బుక్ చూసిన చిరంజీవి ఆసక్తి కనబరిచారు. తాను పుస్తకం చదువుతానని తెలిపారు. తెలుగులో ఇటువంటి పుస్తకం తీసుకు రావడం అభినందనీయం అని ప్రశంసించారు. ఇంకా ఆయన మాట్లాడుతూ... "హిచ్ కాక్ సినిమాలు కొన్నిటిని నేను కాలేజీ చదువుతున్న రోజుల్లో చూశాను. ఈ పుస్తకాన్ని ఖాళీ సమయం దొరికినప్పుడల్లా పది పదిహేను రోజుల్లో



చదివేస్తాను. ప్రపంచ సినిమా చరిత్రలో దిగ్గజ దర్శకుడి గురించి తెలుగులో బుక్ రావడం అభినందనీయం. ఇలాంటి పుస్తకాలను పులగం చిన్నారాయణ, రవి పాడి మరిన్ని సంకల్పించాలి' అని అన్నారు. ప్రసిద్ధ నవలా రచయిత మల్లాది వెంకట కృష్ణమూర్తి ఈ పుస్తకానికి ముందుమాట రాయడంతో పాటు ఆయన కెరీర్ లో తొలిసారి ఒక పుస్తకాన్ని ప్రశంసిస్తూ పాడ్ కాస్ట్ విడుదల చేశారు. అలాగే సంచలన దర్శకులు రామ్ గోపాల్ వర్మ కూడా ముందుమాట రాశారు.



## తుది దశలో కింగ్‌డమ్


అగ్ర హీరో విజయ్ దేవరకొండ నటిస్తున్న తాజా చిత్రం 'కింగ్‌డమ్'. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ నిర్మిస్తున్నది. మే 30న ప్రపంచవ్యాప్తంగా విడుదలకానుంది. ఇటీవల విడుదలైన టీజర్ సినిమాపై అంచనాలను పెంచింది. 'ఇంత బీభత్సం ఎవరి కోసం..రణభూమిని చీల్చుకొని పుట్టే కొత్త రాజు కోసం..' అనే సంభాషణలతో టీజర్ గూజ్‌బంప్స్ తెప్పించింది. పీరియాడిక్ కథాంశంతో తెరకెక్కిస్తున్న ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతున్నది. తుది షెడ్యూల్ వైజాగ్‌లో మొదలైంది. మార్చి మొదటివారం వరకు జరిగే షెడ్యూల్‌తో సినిమా షూటింగ్ మొత్తం పూర్తవుతుందని తెలుస్తున్నది. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: జోమోన్ టి జాన్, గిరీష్ గంగాధరన్, ఆర్ట్: అవినాష్ కొల్లా, సంగీతం: అనిరుధ్ రవిచందర్, నిర్మాతలు: సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య, రచనదర్శకత్వం: గౌతమ్ తిన్ననూరి.

# క్రీడా వార్తలు SPORTS NEWS

## పాకిస్థాన్‌లో మార్మోగిన భారత జాతీయ గీతం..!

### సోషల్ మీడియాలో వీడియో వైరల్..!

పాకిస్థాన్ వేదికగా జరుగుతున్న ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీలో ఆశ్చర్యకర ఘటన చోటు చేసుకున్నది. లాహోర్‌లోని గడాఫీ స్టేడియంలో ఆస్ట్రేలియాఇంగ్లాండ్ మధ్య మ్యాచ్ జరుగుతున్నది. మ్యాచ్‌కు ముందు మ్యాచ్‌లో పాల్గొనే జట్ల జాతీయ గీతాలాపన జరిగే విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ జట్ల క్రికెటర్లు జాతీయ గీతాపాలన కోసం నిల్చున్నారు. ఆస్ట్రేలియా జాతీయ గీతానికి బదులుగా నిర్వాహకులు భారత దేశ జాతీయ గీతాన్ని ప్లే చేశారు. దాంతో స్టేడియంలో అభిమానులంతా కేకలు వేశారు. ఆస్ట్రేలియా క్రికెటర్లు సైతం ఆశ్చర్యపోయారు. ఆ తర్వాత వెంటనే తప్పును గ్రహించిన నిర్వాహకులు భారత జాతీయ గీతాన్ని నిలిపివేసి.. ఆస్ట్రేలియా జాతీయ గీతాన్ని ప్లే చేశారు. అయితే, అప్పటికే భారత జాతీయ గీతంలోని 'భారత భాగ్య విధాత' వరకు ప్లే అయ్యింది. ఇందుకు సంబంధించిన సోషల్ మీడియాలో పాక్‌పై పలువురు క్రికెట్ ఫ్యాన్స్ మండిపడుతున్నారు.




వాస్తవానికి, చాంపియన్స్ ట్రోఫీ కోసం భారత జట్టు పాకిస్థాన్‌లో ఆడబోవడం లేదు. హైబ్రిడ్ మోడల్‌లో దుబాయి వేదికగా ఆడుతున్నది. జాతీయ గీతాలాపన సమయంలో జాగ్రత్తగా ఉండాల్సిన నిర్వాహకులు.. ఒక దేశం జాతీయ గీతానికి బదులు.. మరో జాతీయ గీతం ప్లే చేయడంపై మండిపడుతున్నారు. ఐసీసీ టోర్నీ సమయాల్లో పోటీపడే రెండు జట్ల జాతీయ గీతాలను మ్యాచ్‌కు ముందు ప్లే చేశారు. టాస్ తర్వాత ఈ కార్యక్రమం జరుగుతుంది. అనంతరం ఇరుజట్ల ఆటగాళ్లు కరచాలనం చేసుకుంటారు. చాంపియన్స్ ట్రోఫీలో ఇదేం తొలి వివాదం కాదు. గతంలో కూడా ఐసీసీ పరిశీలనలోకి వచ్చాయి. టోర్నీ ప్రారంభానికి ముందు కరాచీలోని నేషనల్ స్టేడియంలో భారత జెండాను ఎగుర వేయలేదు. పోటీపడే అన్ని జెండాలను ఎందుకు ఎగురవేయలేదనే విమర్శలు వచ్చాయి. దీనిపై పీసీబీని ప్రశ్నించగా.. భారత జట్టు పాక్‌లో పర్యటించడం లేదని.. అందుకు ఆ దేశ జెండాను ఏర్పాటు చేయలేదని పేర్కొంది. ఆ తర్వాత పీసీబీ భారత జెండాను ఎగుర వేసింది.

## సెలెక్టర్లను నమ్మని పాకిస్తాన్ క్రికెట్ బోర్డు చైర్మన్..?

### చాంపియన్స్ ట్రోఫీ జట్టుపై రెండుసార్లు సమీక్ష..!

చాంపియన్స్ ట్రోఫీ కోసం పాకిస్తాన్ తుదిజట్టును ప్రకటించే ముందు కనీసం రెండుసార్లు సమీక్షించాలని పీసీబీ చైర్మన్ మోహ్సిన్ ఖన్వీ జాతీయ సెలెక్టర్లను కోరినట్లు తెలుస్తున్నది. ఐసీసీ ఈవెంట్ కోసం సెలెక్టర్లు జట్టును ఖరారు చేసి.. తుది ఆమోదం కోసం పీసీబీ చైర్మన్‌కు పంపగా.. నఖ్వీ తిప్పిపంపుతూ.. బెస్ట్ ప్లేయర్స్‌నే సెలెక్ట్ చేశారా? లేదా? సమీక్షించుకోవాలని సూచించినట్లుగా సంబంధిత వర్గాలు తెలిపాయి. చాలా సంవత్సరాల తర్వాత ఐసీసీ టోర్నీకి పాకిస్తాన్ ఆతిథ్యం ఇస్తున్నది. ఈ క్రమంలో ఐసీసీ ఈవెంట్‌లో ఎలాగైనా గెలిచి.. టైటిల్‌ను నిలబెట్టుకోవాలని పీసీబీ ఆశిస్తున్నది. ఇక చాంపియన్స్ ట్రోఫీలో భాగంగా



ఈ నెల 19న జరిగిన మ్యాచ్‌లో న్యూజిలాండ్‌పై చిత్తుగా ఓడిపోయింది. ఫిబ్రవరి 23న ఆదివారం కీలక మ్యాచ్‌ను ఆడనున్నది. భారత్‌తో ఢీకొట్టనున్నది. ఇది పాక్‌కు డు ఆర్ డై మ్యాచ్. ఎందుకంటే ఈ మ్యాచ్‌లో ఓడిపోతే టోర్నమెంట్ నుంచి నిష్క్రమించే అవకాశం ఉంది. చాంపియన్స్ ట్రోఫీకి సెలెక్టర్లు ఎంపిక చేసిన జట్టు విషయంలో ఆందోళనగా ఉన్న ఆయన.. మూడోసారి మాత్రం చాంపియన్స్ ట్రోఫీకి జట్టుకు ఆమోదముద్ర వేశారు. జట్టు విషయంలో పూర్తిగా బాధ్యతలు వహిస్తామని సెలెక్టర్లు.. టీమ్ మేనేజ్‌మెంట్‌కు స్పష్టం చేసినట్లు సంబంధిత వర్గాలు చెప్పాయి. జాతీయ సెలక్షన్ కమిటీలో జట్టు తాత్కాలిక హెడ్‌కోచ్ ఆకిబ్ జావేద్, అసద్ షఫీక్, అజార్ అలీ, అలీమ్ దార్, హసన్ చీమా ఉన్నారు. ఓ మీడియా నివేదిక ప్రకారం.. జాతీయ జట్టు సెలెక్టర్లపై పీసీబీ చైర్మన్ నఖ్వీకి ఏమాత్రం నమ్మకం లేదని.. జట్టుపై ఆయనకున్న ఆందోళనను ఇది ప్రతిబింబిస్తుందని ఓ మూలం తెలిపింది.



## భారత్-బంగ్లా మ్యాచ్‌పై ఐసీసీకి ఫిర్యాదు చేసిన పీసీబీ..!

### అసలు ఏం జరిగిందంటే..?

చాంపియన్స్ ట్రోఫీలో భాగంగా దుబాయి వేదికగా గురువారం భారత్ - బంగ్లాదేశ్ మ్యాచ్ ప్రత్యక్ష ప్రసారం సందర్భంగా చూపించిన లోగోలో పాకిస్తాన్ పేరు లోగోలో లేకపోవడంపై పాకిస్థాన్ క్రికెట్ బోర్డు అసంతృప్తి వ్యక్తం చేసింది. అయితే, తప్పును అంగీకరించిన ఐసీసీ.. రాబోయే మ్యాచ్‌ల సమయంలో పాకిస్థాన్ పేరుతో మూడులైన్ల లోగోను ఉపయోగించేలా చూస్తామని హామీ ఇచ్చినట్లుగా సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ సారి ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీకి పాకిస్థాన్ ఆతిథ్యం ఇస్తున్న విషయం తెలిసిందే. అయితే, భద్రతా కారణాల నేపథ్యంలో ఆ దేశంలో పర్యటించేందుకు భారత్ నిరాకరించింది. ఈ క్రమంలో హైబ్రిడ్ మోడల్‌లో దుబాయి వేదికగా ఆడుతున్నది. దుబాయి వేదికగా జరిగిన భారత్‌బంగ్లాదేశ్ మధ్య జరిగిన మ్యాచ్ ప్రత్యక్ష ప్రసారంలో లోగోలో పాక్ పేరు లేకపోవడంపై ఐసీసీకి పీసీబీ లేఖ రాసినట్లుగా ఐసీసీ వర్గాలు ధ్రువీకరించాయి. దుబాయిలో జరిగే అన్ని మ్యాచుల్లో పాకిస్తాన్ పేరు ఉండేలా.. మూడు లైన్ల లోగోను ఉపయోగిస్తామని ఐసీసీ హామీ ఇచ్చిందని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. భారత్, బంగ్లాదేశ్ మ్యాచ్ ప్రసారంలో ఎగువ ఎడమ వైపున ఉన్న లోగోపై ఛాంపియన్స్ ట్రోఫీ 2025 మాత్రమే కనిపించింది. ఆతిథ్య పాకిస్తాన్ పేరు మాత్రం కనిపించలేదు. చాంపియన్స్ ట్రోఫీలో భాగంగా దుబాయి వేదికగా ఆదివారం (ఫిబ్రవరి 23) భారత్‌పాక్, మార్చి 2న భారత్ - న్యూజిలాండ్ మధ్య మ్యాచ్ జరుగనున్నది.



## ఆ ఇద్దరిని త్వరగా అవుట్ చేస్తేనే..!

### రేపటి భారత్ పాకిస్థాన్ మ్యాచ్‌లో గెలుపు ఎవరిదో చెప్పిన మాజీ కెప్టెన్ ఇంజమామ్..!

చాంపియన్స్ ట్రోఫీలో భాగంగా ఆదివారం భారత్‌పాకిస్థాన్ మధ్య మ్యాచ్ జరుగనున్నది. దుబాయి ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో జరుగనున్న మ్యాచ్ కోసం క్రికెట్ ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ సందర్భంగా మ్యాచ్‌పై పలువురు మాజీలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఆఫీషియల్ బ్రాడ్‌కాస్టర్ నిర్వహించిన కార్యక్రమంలో మాజీ క్రికెటర్లు ఇంజమామ్ ఉల్ హక్, షాహిద్ ఆఫ్రిది, యువరాజ్ సింగ్, నవజ్యోత్ సింగ్ సిద్ధూ వంటి దిగ్గజాలు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంజమామ్ ఉల్ హక్ భారత్‌పాక్ మ్యాచ్‌లో ఏ జట్టు విజయం సాధిస్తుందో జోష్యం చెప్పారు. రెండు దేశాల మధ్య మ్యాచ్ అంటే ఎప్పుడూ ఆటగాళ్లపై ఒత్తిడి ఉంటుందన్నారు. సంవత్సరానికి ఒకేసారి మ్యాచ్ జరుగుతుండడంతో ఒత్తిడి పెరుగుతుందని.. చాలా మ్యాచులు జరిగితే ఆటగాళ్లు ఒకరినొకరు దగ్గరగా ఉంటారని పేర్కొన్నారు. మ్యాచ్‌లో ఏ జట్టు సమతూకంగా ఉంటుందో.. ఆ జట్టు మ్యాచ్‌లో పైచేయి సాధించేదని.. టీ20 క్రికెట్ కారణంగా ఆట వ్యక్తిగతంగా మారిందన్నారు. ఒక ఆటగాడే మ్యాచ్ గమనాన్నే మారుస్తున్నాడని చెప్పారు. ఇటీవల భారత జట్టు బలంగానే ఉందన్నారు. ముఖ్యమంగా రవీంద్ర జడేజా, హార్దిక్ పాండ్యా వంటి ఆల్ రౌండర్ల కారణంగా లోయర్ ఆర్డర్‌లో జట్టు సమతూకంగా ఉందని పేర్కొన్నారు. ఈ సారి మ్యాచ్‌లో అన్నింట్లో సమతూకంగా ఉన్న జట్టే పైచేయి సాధిస్తుందని చెప్పారు. టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ, సీనియర్ ప్లేయర్ విరాట్ కోహ్లీపై ఇంజమామ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ ఇద్దరు ప్లేయర్ బెస్ట్ ప్లేయర్స్ అనడంలో సందేహం లేదని.. ఇద్దరూ దాదాపు 20 సంవత్సరాలుగా నిలకడగా రాణిస్తున్నారని.. జట్టుపై వీరిద్దరి ప్రభావం చాలా ఎక్కువగా ఉంటుందని తెలిపాడు. వీరిద్దరు త్వరగా అవుట్ అయితే భారత డ్రెస్సింగ్ రూమ్‌లో గణనీయంగా మార్పు ఉంటుందని..దాంతో పాక్ జట్టు మనోధైర్యం పెంచుతుందని మాజీ కెప్టెన్ పేర్కొన్నారు. మిగతా భారత ఆటగాళ్లు బాగా ఆడరనేది దానర్థం కాదని.. టీమిండియాలో చాలామంది ప్రతిభావంతులైన ప్లేయర్స్ ఉన్నారని..వారంతా ఇప్పుడిప్పుడే ఎదుగుతున్నారన్నారు. పాక్ ఆటగాడు బాబర్ ఆజం త్వరగా అవుట్ అయితే.. ప్రత్యర్థి బౌలర్ల అంచనాలు పెరుగుతాయని..పాకిస్థాన్ డ్రెస్సింగ్ రూమ్‌లో ఒత్తిడి పెరుగుతుందన్నారు. పాకిస్తాన్ గెలవాలంటే.. లోయర్, మిడిల్ ఆర్డర్ రాణించాలని.. రోహిత్, విరాట్ ఇద్దరి వికెట్లను త్వరగా తీస్తే.. పాకిస్థాన్‌కు లాభిస్తుందని ఇంజమామ్ వివరించారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com